ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
ఆదివారం, 15 సెప్టెంబరు 2024



5

ఇంత వరదను ఏనాడూ చూడలేదు..

- సహాయక చర్యల్లో పాలుపంచుకున్నా
- సహాయం కోసం కేంద్రాన్ని కలుస్తాం
- 'ఆంధ్రజ్యోతి'తో ఎంపీ రఘురాంరెడ్డి



చెక్కు చెదరని కట్టడం 'పాలేరు'

- రెండు లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా తట్టుకున్న రిజర్వాయర్
- నవాబ్ అలీ నవాజ్ జంగ్ ఇంజనీరింగ్ నైపుణ్యానికి ప్రతిరూపం
- ఖమ్మం జిల్లా పాలిట వరప్రదాయిని..
- నేడు ఇంజనీర్స్ డే

4



భద్రాచలం వద్ద స్వల్పంగా పెరుగుతున్న గోదావరి

- సాయంత్రం 6 గంటలకు 38.9 అడుగుల నీటిమట్టం

మా ఆవిడ బంగారం

సండే స్పెషల్
SUNDAY SPECIAL



సతీ'మణి'...

- ఇంటి బాధ్యతలు, పిల్లల ఆలనాపాలనలో కీలకపాత్ర
- భార్య సహకారం లేకుంటే సక్సెస్ కావడం కష్టమే..
- ఒక్కరోజు కాదు, ప్రతిరోజూ థ్యాంక్స్ చెప్పినా తక్కువే..
- ఆమె త్యాగం, సేవలు వెలకట్టలేనివి...
- వివిధ శాఖల ఉన్నతాధికారుల మనోగతం

ఖమ్మం సంక్షేమ విభాగం/ఖమ్మం కలెక్టరేట్ /భద్రాచలం, సెప్టెంబరు 14: 'ఆలయాన వెలిసిన ఆ దేవుని రీతి.. ఇల్లాలే ఈ జగతికి జీవనజ్యోతి..' అన్నాడు ఓ సినీకవి. కుటుంబాన్ని జగతితో పోలుస్తూ... ఆమే ఆ కుటుంబానికి వెలుగునిచ్చే జ్యోతి అని కీర్తించాడు. ఇల్లాలు లేని ఇల్లు ఎడారిలా... మోడు వారిన వృక్షంలా.. కటిక చీకట్లు కమ్ముకున్న అమావాస్యలా కనిపిస్తుంది. కుటుంబ యజమానికి వెన్నుదన్నుగా నిలుస్తూ భార్య పోషించే పాత్రను కీర్తించడానికి ఎన్ని విశేషణాలైనా సరిపోవు.

అందుకే ప్రతి పురుషుడి విజయం వెనక ఓ మహిళ ఉంటుందనే నానుడి స్థిరపడిపోయింది. ఉన్నతాధికారులైనా, ప్రముఖులైనా తమ విధులను, కార్యాలను విజయవంతంగా సాగించడానికి తెరవెనుక భార్య, కుటుంబం సహకారం తప్పనిసరి. అది లేకపోతే ఎవరూ రాణించలేరు. సాఫీగా ముందుకుసాగలేరు. బయట ఎంత ప్రముఖుడైనా, ఇంట్లో భార్య ప్రోత్సాహం లేకపోతే ఉన్నతశిఖరాలకు చేరలేరు. భర్త సక్సెస్ కోసం, విజయం కోసం తమ జీవితాలను త్యాగం చేసే మహిళలు ఎందరో. ఉన్నతచదువులు చదివినా, బంగారు భవిష్యత్తు ఉన్నా కేవలం భర్త, పిల్లల కోసమే వాటిని త్యజించి కొవ్వొత్తిలా కరిగిపోతుంటారు. అయితే పురుషాధిక్య సమాజంలో భార్యల సేవలు, త్యాగాలు గుర్తింపునకు నోచుకోకుండా పోవడమనేది ఏళ్లుగా జరుగుతోంది. ఆయా రంగాల ప్రముఖులు కూడా అంతరంగిక సందర్భాల్లో భార్యల సేవలను కొనియాడుతుంటారే గానీ బహిరంగంగా చెప్పుకోరు. అందుకోసమే భార్యను గుర్తించేందుకు, వారి త్యాగాలను ప్రశంసించేందుకు ఏడాదిలో ఒక రోజును కేటాయించారు. సెప్టెంబరు నెల మూడో ఆదివారాన్ని 'భార్యను ప్రశంసించే రోజు'గా జరుపుతున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని కొందరు ప్రముఖులను పలకరించినప్పుడు వారు తమ జీవిత భాగస్వామి సేవలను, త్యాగాలను గొప్పగా చెప్పుకొచ్చారు. వారికి ఒక్క రోజు కాదు, జీవితాంతం థ్యాంక్స్ చెప్పినా సరిపోదని ప్రశంసిస్తున్నారు.

నేడు భార్యను భర్త ప్రశంసించే రోజు



నా సతీమణి సహకారం మరువలేనిది

బి.రాహుల్, భద్రాచలం ఐటీడీఏ పీవో

అనుక్షణం నన్ను ప్రోత్సహిస్తూ నా వెంట నడిచే నా సతీమణి మనీష సహకారం ఎన్నటికీ మరువలేనిది. నేను సివిల్స్‌కు సిద్ధమవుతున్న తరుణంలో మానసిక స్థైర్యాన్నిచ్చి విజయం సాధించడానికి సహకరించింది. వృత్తిరీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయురాలైనా ప్రవృత్తి రీత్యా ఆధ్యాత్మిక, సేవా భావాలు కలిగి ఉంటుంది. విధి నిర్వహణలో నేను బిజీగా ఉండటం సహజం కాబట్టి, ఇంటికి సంబంధించిన అన్ని పనులను తనే చూసుకుంటుంది. నాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన సహకారం అందిస్తూ ఉంటుంది. ప్రతి పురుషుడి విజయం వెనకాల ఓ స్త్రీ మూర్తి ఉంటుంది అన్న నానుడిని నిజం చేస్తూ నాకు సమున్నతమైన రీతిలో సహకారం అందిస్తున్న నా సతీమణికి థ్యాంక్స్



వైద్య వృత్తినే మానేసింది...

డి.మధుసూదన్‌నాయక్, అదనపు కలెక్టర్

నా సహధర్మచారిణి పేరు సరిత. వృత్తి పరంగా ఆమె డాక్టర్. నాకు ఉన్న పనిఒత్తిడి కారణంగా ఆమె తన వైద్య వృత్తిని కూడా మానేసింది. మేం 15 రోజులకోమారు కూడా కలిసే పరిస్థితి లేదు. ప్రస్తుతం నా కుటుంబ బాధ్యత అంతా తానే చూసుకుంటుంది. మాకు ఇద్దరు పిల్లల్లో పాప ఎల్‌ఎల్‌బీ చదువుతోంది. బాబు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఉద్యోగంలో చేరి పెళ్లయి పిల్లలు పుట్టినప్పటి నుంచి నేను పిల్లలతో గడిపే పరిస్థితి లేదు. దీంతో నా భార్య హైదరాబాద్‌లో ఉంటూ పిల్లలను చదివిస్తోంది. నేను ఎంత ఒత్తిడితో ఆఫీస్, వీఐపీల పర్యటనలతో బీజీగా ఉన్నా కుటుంబ ఇబ్బందులు ఏమాత్రం తెలియకుండా అన్నీ తానై చూసుకుంటోంది. నా ప్రతి విజయం వెనుక తన బాధ్యత, కృషి ఎప్పటికీ ఉంటోంది. ఆమెకు నేను ఎప్పుడు కృతజ్ఞుడినే..



నా కోసం తన కెరీర్‌ను త్యాగం చేసింది..

సిద్ధార్థ విక్రమ్ సింగ్, అటవీశాఖ అధికారి, ఖమ్మం

నా భార్య పేరు అపూర్వ గౌతమ్. ప్రపంచ ప్రఖ్యాత లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో డిగ్రీ పూర్తి చేసింది. ఐఐటీ ప్రొఫెసర్ పోస్టుకు ఎగ్జామ్ రాసి ఇంటర్వ్యూ కూడా పూర్తి చేసింది. అవకాశం వచ్చినా వెళ్లలేదు. కుటుంబం కోసం కెరీర్‌ను వదులుకొంది. నాతో వివాహం జరిగిన తర్వాత నేను ఏ అటవీ ప్రాంతంలో పనిచేస్తే అక్కడే నాతోనే ఉంది. నాది ఉత్తరప్రదేశ్... అపూర్వది మధ్యప్రదేశ్ రాష్ట్రం. పెద్దల నిర్ణయం మేరకు 2020 ఫిబ్రవరిలో మా వివాహం జరిగింది. వివాహం తర్వాత అపూర్వ ఇతర దేశాలు వెళ్లేందుకు ఇష్టపడలేదు. భోపాల్‌లో పుట్టి లండన్‌లో పెరిగినా వివాహం తర్వాత నాతో నిర్మల్ నుంచి ఖమ్మం వరకు నేను ఎక్కడ ఉంటే అక్కడ నాతో పాటే ఉంటూ వచ్చింది. తనకు వన్యప్రాణులు, అడవులు, పక్షులు, జంతులు అంటే ఎంతో ఇష్టం. కరోనా కష్టకాలంలోనూ మేమిద్దరమే అటవీ ప్రాంతంలో చిన్న భవనంలో ఉన్నాం. 10 కి.మీ. దూరంలో వైద్యసేవలు లేవు. ఉద్యోగంలో నాకు ఏమైనా జరుగుతుందనే ఆందోళనతో కొన్నిసార్లు రాత్రిళ్లు కూడా అటవీప్రాంతంలో పలు రైడింగ్‌లలో పాల్గొంది. ప్రతి క్షణం నాతో ఉండేందుకు ఇష్టపడుతుంది. తాను ఇప్పుడు ఆన్‌లైన్‌లో పీహెచ్‌డీ చేస్తోంది. మాకు ఒక పాప ఈవీశ.

అన్నీ తానై చూసుకుంటుంది..

గుంటుపల్లి గణేష్, ఆర్డీవో, ఖమ్మం



నా 16 ఏళ్ల సర్వీస్‌లో 8 సార్లు బదిలీ అయ్యా. రెవెన్యూ శాఖ కావడం వల్ల పని ఒత్తిడి విపరీతంగా ఉంటుంది. వీఐపీల పర్యటనలు, కార్యాలయంలో బిజీ, సందర్భులతో.. ఇలా రోజులో కనీసం 12 గంటలు కూడా సరిపోని పరిస్థితి. ఈ స్థితిలో కుటుంబానికి న్యాయం చేయలేక పోతున్నా. మాది సూర్యాపేట జిల్లా కోదాడ. నాకు 2008లో నీలిమతో పెళ్లయ్యింది. ఆ తర్వాత రెండేళ్లకు బాబు, ఆ తర్వాత ఇద్దరు ఆడపిల్లలు (ట్విన్స్) పుట్టారు. ప్రస్తుతం బాబు ఇంటర్మీడియట్, పాపలు తొమ్మిదో తరగతి చదువుతున్నారు. వీరితో గడిపే సమయం ఉండదు. వారి ఆలనా పాలనా అంతా నా భార్యే చూసుకుంటుంది. ఇలా నా ఉద్యోగానికి.. నాకు 16 ఏళ్లుగా సహకరిస్తున్న నా భార్యకు నేను రుణపడి ఉన్నా.. ఇలాంటి ఒక రోజులో ఆమెను ప్రశంసించడం ఆనందంగా ఉంది.

మా కుటుంబానికి ఆమె నిండు 'వసంత'ం...

కస్తాల సత్యనారాయణ, డిప్యూటీ డైరెక్టర్, సాంఘిక సంక్షేమశాఖ, ఖమ్మం



నేను 1991లో వాజేడులో వార్డెన్ ఉద్యోగం సాధించా. తర్వాత కాలంలో ముచ్చర్ల, మరిపెడ, భద్రాచలం, కొత్తగూడెం, మధిర ఇలా 22ఏళ్ల పాటు ఖమ్మం విడిచి బయటే పనిచేశా. ఉద్యోగరీత్యా అనేక ప్రాంతాల్లో పనిచేసినా... నా భార్య వసంత ఖమ్మంలోనే ఉంటూ ఇద్దరు పిల్లల బాగోగులు చూసింది. ఉద్యోగంలో నాకు ఇప్పటి వరకు 19 అవార్డులు వచ్చినా నా కుటుంబ నిర్వహణలో నేను జీరో. నా భార్యే నా కుటుంబానికి వసంతం. మాది ప్రేమతో కూడిన పెద్దలు కుదిర్చిన వివాహం. పెళ్లి తర్వాత ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ దశలో నా భార్య ఇంట్లో ఉండి డిగ్రీ, పీజీ, బీఈడీ, తెలుగు పండిట్ పూర్తి చేసింది. అప్పులు తీర్చేందుకు ప్రైవేట్ కాలేజీకి వెళ్లి లెక్చరర్‌గా పనిచేసింది. మా ఇద్దరు పిల్లల్లో పెద్దోడు అమెరికాలో, చిన్నవాడు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా స్థిరపడ్డారు. ఆ క్రెడిట్ ఆమెదే.

వరద విపత్తులకు శాశ్వత పరిష్కారం

- ప్రత్యేకంగా రాష్ట్రస్థాయిలో బృందాలను ఏర్పాటు చేస్తాం
- నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల సహాయం
- రాష్ట్రవ్యాప్తంగా జరిగిన నష్టం రూ.10,330 కోట్లు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పలుచోట్ల రైతులతో మాటామంతీ
- కాల్వ గండి మరమ్మతులు పూర్తిచేయాలని ఆదేశం

నేలకొండపల్లి/తిరుమలాయపాలెం/కూసుమంచి, సెప్టెంబరు 14: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వరదల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా రూ.10,330కోట్ల నష్టం వాటిల్లినట్టు పాలేరు శాసనసభ్యుడు, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. శనివారం ఆయన పాలేరు నియోజకవర్గ పరిధిలో పర్యటించారు. వరదల వల్ల నష్టపోయిన రైతులతో మాట్లాడారు. దెబ్బతిన్న రోడ్ల మరమ్మతు పనులను పరిశీలించారు. నేలకొండపల్లి మండలం కట్టుకాచారం గ్రామంలో వరదలతో నష్టపోయిన రైతులతో సంభాషించారు. వారి వేదనను ఆలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రబృందం ప్రాథమిక అంచనా ప్రకారం రాష్ట్రంలో వరద నష్టం విలువ రూ.10,330కోట్లని తెలిపారు. విద్యుత్, సాగు, తాగు, రోడ్ల మరమ్మతులు తుది దశలో ఉన్నాయని, వరద విపత్తులకు శాశ్వత పరిష్కారం కనుగొనే దిశగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. తిరిగి ఎప్పుడైనా ఇటువంటి విపత్తులు వస్తే ఎదుర్కోవటానికి కేంద్ర బృందాలతో కంటే రాష్ట్ర బృందాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. రాష్ట్రవ్యాప్తంగా 8 పోలీస్ బెటాలియన్ కమాండెంట్‌లున్నాయి. ఒక్కొక్క కమాండెంట్ నుంచి 100మందికి క్షుణ్ణంగా తర్ఫీదునిచ్చి సిద్ధం చేయాలని నిర్ణయించామని చెప్పారు.

గడచిన నాలుగేళ్లలో విపత్తు నిర్వహణ కోసం వచ్చిన నిధులు దాదాపు రూ.1300 కోట్ల పైచిలుకు పేరుకు పేపర్‌పై ఉన్నాయి. కానీ ప్రభుత్వం వద్ద లేవని, నిజంగా ఖర్చు పెట్టి లెక్కలు చూపించలేక పోయిందా... లేదా... అనేది విచారణ చేస్తున్నామని చెప్పారు. త్వరలో ముఖ్యమంత్రి, తాను, అధికారుల బృందం రాష్ట్రానికి నిధుల సహాయం కోసం ప్రధానిని కలువబోతున్నామని తెలిపారు. 'వరదల్లో నష్టపోయిన రైతన్నకు ఎకరాకు రూ.10వేలు తక్షణ సహాయంగా రెండ్రోజుల్లో అందించబోతున్నాం.. ఇల్లు నష్టపోయిన వారికి రూ.16,500 ఇచ్చాం. పూర్తిగా పోయిన వారికి మొదటి విడతలోనే (మిగతా 5వ పేజీలో)



సాగర్ ఎడమకాల్వ గండిపూడ్చివేత పనులు పరిశీలిస్తున్న మంత్రి



ముగ్గురు ముఖ్యులు...

ఆపద వేళ అండగా..

- వరద బాధితుల చెంతనే ముగ్గురు మంత్రులు
- ఒకవైపు అధికారులను అప్రమత్తం చేస్తూనే చురుగ్గా సేవా కార్యక్రమాలు
- తన అపార అనుభవాన్ని ఉపయోగించిన మంత్రి తుమ్మల
- తొలిసారి మంత్రుల హోదాలో వరద సేవల్లో భట్టి, పొంగులేటి
- బాధితులకు సాధ్యమైనంత ఎక్కువ సాయం అందేలా కృషి

ఖమ్మం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సాధారణంగా వర్షాలు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీవ్రంగా నష్టం జరిగితే బాధిత ప్రజలు కొన్ని సందర్భాల్లో ప్రభుత్వం తమను సరిగా పట్టించుకోవట్లేదని ఆగ్రహించడం, ఆందోళనలు చేయడం చూస్తుంటాం.. కానీ ఇటీవల జిల్లాలో వచ్చిన భారీవర్షాలు, వరదల వేళ అలాంటి దృశ్యాలు, సందర్భాలు ఎక్కడా కనిపించలేదు. భారీ వర్షాలతో జిల్లాలో మున్నేరు, ఆకేరు, పాలేరు, కట్టలేరు ఉగ్రరూపం దాల్చడంతో ఆయా ప్రాంతాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. ప్రజల ఆస్తులు, పొంట పొలాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. గతంలో ఎన్నడు చూడని నష్టాన్ని బాధితులు చూశారు. కానీ గతానికి భిన్నంగా ప్రజాప్రతినిధులు ఈ సారి వరద బాధితుల చెంతనే ఉంటూ వరదలో సర్వం కోల్పోయినవారికి మనోధైర్యాన్ని కల్పించారు.

ముఖ్యంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం, పాలేరు, మధిర నియోజకవర్గాల్లో వరద ప్రభావం తీవ్రంగా ఉంది. మున్నేరు, ఆకేరు, పాలేరు, కట్టలేరు వరదలతో గతంలో ఎన్నడూ ఎరుగని నష్టం జరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో ఆయా నేతలు వరద బాధిత ప్రాంతాల్లో నిత్యం పర్యటిస్తూ సహాయ కార్యక్రమాలను ముమ్మరం చేశారు. ఒకపక్క అధికారులను సమన్వయం చేస్తూ వరద ప్రాంతాల్లో పరిస్థితులను చక్కదిద్దుతూనే మరో వైపు దాతలను కూడగట్టి బాధితులకు సహాయం అందించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్‌చౌహాన్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి వారికి మనోధైర్యం కల్పించారు.

అనుభవాన్నంతా ఉపయోగించిన తుమ్మల

మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వరద సహాయ కార్యక్రమాల్లో అపార అనుభవం ఉంది. ఉమ్మడి రాష్ట్రం నుంచే మంత్రిగా, విపక్ష (మిగతా 5వ పేజీలో)

నిమజ్జనం వేళ ట్రాఫిక్ ఆంక్షలు



రూట్‌మ్యాప్ పరిశీలిస్తున్న సీపీ సునీల్‌దత్

- నగరంలో పలు రూట్లలో దారిమళ్లింపు
- ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు
- 700మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు
- ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలి
- పోలీసు కమిషనర్ సునీల్‌దత్

ఖమ్మంక్రైం, సెప్టెంబరు 14: గణేష్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా సోమవారం ఖమ్మం నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్టు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. నగరంలో గణేష్ నిమజ్జనం జరిగే మున్నేరు వద్ద శనివారం సీపీ, జిల్లా పోలీసు, ట్రాఫిక్ అధికారులతో కలిసి ట్రాఫిక్ రూట్‌మ్యాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో నిమజ్జనం జరిగేలా ప్రతీ ఒక్కరు సహకరించాలని శోభాయాత్రలో సౌండ్‌సిస్టమ్, డీజేలు, లేజర్ లైట్లు వినియోగించడం నిషేధమన్నారు. వాహనాల డ్రైవర్లు మద్యం, మత్తు పానీయాలు సేవించవద్దని, మద్యం సేవించి వాహనాలు నడిపితే తగు చర్యలు తీసుకుంటామన్నారు. నిమజ్జనం సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 700మంది పోలీసుసిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశామని, వీరిలో ఏసీపీలు 7, సీఐలు 18, ఎస్‌ఐలు 62, ఏఎస్‌ఐ, హెచ్‌సీలు 175, కానిస్టేబుళ్లు 405 హోంగార్డులు 159 మందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

శోభాయాత్ర మార్గాలు

- మామిళ్లగూడెం విగ్రహాల ఊరేగింపు మయూరిసెంటర్, కిన్నెర సెంటర్, జడ్పీసెంటర్, చర్చికాంపౌండ్, ప్రకాష్‌నగర్ మున్నేరు వద్ద నిమజ్జనం పాయింట్ లేదా బొక్కలగడ్డ మున్నేరు నిమజ్జన పాయింట్‌కు చేరుకోవాలి
- ఆర్‌టీఏ కార్యాలయం, బ్యాంకుకాలనీ గణేష్ విగ్రహాల ఊరేగింపు ఎన్టీఆర్ సర్కిల్, ఇల్లెందు క్రాస్‌రోడ్, చర్చికాంపౌండ్ మీదుగా ప్రకాష్‌నగర్ లేదా బొక్కలగడ్డ మున్నేరు నిమజ్జన పాయింట్‌కు చేరుకోవాలి.
- రోటరీనగర్, ఇందిరానగర్ గణేష్ విగ్రహాల ఊరేగింపు మమతా క్రాస్‌రోడ్డు, ఇల్లెందు క్రాస్‌రోడ్డు, జడ్పీసెంటర్ మీదుగా ప్రకాష్‌నగర్ లేదా బొక్కలగడ్డ మున్నేరు నిమజ్జన పాయింట్‌కు చేరుకోవాలి.
- కస్బాబజార్, కమాన్‌బజార్ విగ్రహాల ఊరేగింపు చర్చికాంపౌండ్ నుంచి ప్రకాష్‌నగర్ లేదా బొక్కలగడ్డ మున్నేరు నిమజ్జన పాయింట్‌కు చేరుకోవాలి.
- గొల్లగూడెం, శ్రీనగర్ కాలనీ, గణేష్ విగ్రహాల ఊరేగింపు లకారం ట్యాంక్‌బండ్‌నుంచి చెరువుబజార్ మీదుగా చర్చికాంపౌండ్, ప్రకాష్‌నగర్ లేదా బొక్కలగడ్డ మున్నేరు నిమజ్జన పాయింట్‌కు చేరుకోవాలి.
- శ్రీరామ్‌హిల్స్, ముస్తఫానగర్ గణేష్ విగ్రహాల ఊరేగింపు ముస్తఫానగర్, చర్చికాంపౌండ్, ప్రకాష్‌నగర్ లేదా బొక్కలగడ్డ మున్నేరు నిమజ్జన పాయింట్‌కు చేరుకోవాలి.
- వైరారోడ్డు గణేష్ విగ్రహాల ఊరేగింపు జడ్పీసెంటర్, చెర్వు బజార్, చర్చికాంపౌండ్, ప్రకాష్‌నగర్ లేదా బొక్కలగడ్డ మున్నేరు నిమజ్జన పాయింట్‌కు చేరుకోవాలి.
- సారథీనగర్, గాంధీచౌక్ గణేష్ విగ్రహాల ఊరేగింపు గుంటిమల్లన్న రోడ్డు, ట్రంక్‌రోడ్డు, నయాబజార్ ప్రకాష్‌నగర్ లేదా బొక్కలగడ్డ మున్నేరు నిమజ్జన పాయింట్‌కు చేరుకోవాలి.

అదేవిధంగా ప్రకాష్‌నగర్ బ్రిడ్జి, కాల్వొడ్డు బ్రిడ్జిల ద్వారా ఇరువైపులా అన్ని రకాల వాహనాల రాకపోకలు నిమజ్జనం పూర్తయ్యేవరకు రోడ్డు మూసివేయబడుతుందని సీపీ తెలిపారు. అదేవిధంగా రాపర్తినగర్, కరుణగిరి బ్రిడ్జి ద్వారా సాధారణ వాహనాలకు అనుమతి ఉంటుందన్నారు. మయూరిసెంటర్ బ్రిడ్జినుంచి వాహనాల రాకపోకలు నిషేధం. ఊరేగింపు మయూరి బ్రిడ్జిమీదుగా అనుమతిలేదు. నిమజ్జనం అనంతరం రాపర్తినగర్, న్యూబస్టాండ్, ఎన్టీఆర్ సర్కిల్, మమత రోడ్డువైపు వెళ్లే వాహనాలు నెహ్రూసెంటర్ నుంచి ఎఫ్‌సీఐ గోదాం మీదుగా అనుమతిలేదు. ఆ వాహనాలు కాల్వొడ్డు, త్రీటౌన్ పోలీసుస్టేసన్, మిర్చిమార్కెట్, చర్చికాంపౌండ్, చెరువుబజార్, జడ్పీసెంటర్ వెళ్లాల్సి ఉంటుందని సీపీ తెలిపారు.

ఆయిల్‌పామ్ రైతులకు తీపికబురు

- ముడిచమురుపై కేంద్రం దిగుమతి సుంకం పెంపు
- హర్షం వ్యక్తం చేసిన రైతులు, రైతుసంఘం నేతలు

5

స్వల్పంగా పెరుగుతున్న గోదావరి

14 గంటలపాటు 38.8 అడుగుల వద్ద నిలకడగా

భద్రాచలం, సెప్టెంబరు 14: భద్రాచలం వద్ద గోదావరి 14 గంటల పాటు 38.8 అడుగుల వద్ద నిలకడగా ఉంది. శనివారం తెల్లవారుజామున మూడు గంటలకు 38.8 అడుగులకు గోదావరి నీటిమట్టం తగ్గగా అక్కడ నుంచి సాయంత్రం 5గంటల వరకు 38.8 అడుగుల నీటిమట్టమే ఉంది. కాగా సాయంత్రం 6 గంటలకు 38.9 అడుగులకు పెరిగింది. మరింత స్వల్పంగా గోదావరి నీటిమట్టం పెరిగే అవకాశాలున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.



ఇన్‌స్పైర్ నామినేషన్ గడువు పొడిగింపు..

అక్టోబరు 15 వరకు పెంచుతున్నట్టు డీఈవో వెల్లడి

లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబరు 14: ఇన్‌స్పైర్ మనాక్ అవార్డుల నామినేషన్ ఆప్ లోడింగ్ తేదీ అక్టోబరు 15వరకు పొడిగించినట్టు నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్ఐఎఫ్) ఆదేశాలు జారీ చేశారని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరచారి శనివారం తెలిపారు. ఇన్‌స్పైర్ మనాక్ నామినేషన్ల గడువు ఈ నెల 15వరకు ఉన్న గడువును వివిధ కారణాలు, టార్గెట్ పూర్తికాకపోవడంతో నామినేషన్ల తేదీని అక్టోబరు 15వ తేదీకి పొడిగించినట్టు డీఈవో తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 153 పాఠశాలల నుంచి 710నామినేషన్ల మాత్రమే వచ్చాయని, జిల్లాలో మొత్తం 1670 నామినేషన్లు అప్‌లోడ్ చేయాల్సి ఉందన్నారు. ఈ నెల 30వ తేదీ నాటికి 1670 నామినేషన్లు పూర్తి చేయాలని ఆదేశించారు. చివరి వారం వెబ్‌సైట్ బిజీగా ఉంటుందని, ఆ సమయంలో అప్‌లోడ్‌కు వీలు ఉండదని, ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల నుంచి నామినేషన్లు పూర్తి చేయించే బాధ్యత కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల నోడల్ అధికారులదేనని తెలిపారు. ఏమైనా సమస్య ఉంటే జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.చలపతిరాజును సంప్రదించాలని కోరారు.



నిబద్ధత కలిగిన మహానాయకుడు కుతుంబాక

సంస్మరణ సభలో మంత్రి పొంగులేటి, తుమ్మల యుగేందర్

రఘునాథపాలెం, సెప్టెంబరు 14: నిబద్ధత కలిగిన రాజకీయ మహానాయకుడు కుతుంబాక బసవ నారాయణ అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తొలిసారిగా టీడీపీ జెండాను దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్‌తో ఎగురవేయించిన టీడీపీ వ్యవస్థాపక నాయకుడు కుతుంబాక. ఆయన సంస్మరణ సభను శనివారం రఘునాథపాలెం మండలం వీ వెంకటాయపాలెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి బసవ నారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బసవ నారాయణ కుమారులు శ్రీనివాస్, శ్రీధర్, శ్రీరామ్‌లను నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, కాంగ్రెస్ నాయకుడు కాపా ఆదినారాయణ, కిలారు రమణ, కె.సీతారామ్, హన్మంతరావు, నరేందర్, గ్రామశాఖ అధ్యక్షుడు బాణోత్ కిషోర్, వి.కోదండరాములు, కె.నరేశ్, శ్రీనివాస్, జలగం ప్రసాదరావు, పీఆర్ ఇంజనీరింగ్ అధికారులు, ఖమ్మంలోని ప్రముఖ వైద్యులు సంతాపసభలో పాల్గొన్నారు.


కుటుంబ సభ్యుల్ని పరామర్శిస్తున్న మంత్రి పొంగులేటి

కూనంనేని కృషితో చెరువులకు మహర్దశ

- సింగభూపాలెం చెరువు అభివృద్ధి, సుందరీకరణకు రూ.8.50కోట్లు మంజూరు
- చింతలచెర్వు ఆధునీకరణకు మరో రూ.కోటి మంజూరు

కొత్తగూడెం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రత్యేక కృషితో నియోజకవర్గంలోని రెండు చెరువులకు అభివృద్ధి నిధులు మంజూరయ్యాయి. గత పాలకుల నిర్లక్ష్యంతో ఎలాంటి అభివృద్ధికి నోచుకోక శిథిలమై కుంగిపోయి ప్రమాదకర పరిస్థితికి చేరిన సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం చెరువు ప్రాజెక్టు అభివృద్ధికి, చుంచుపల్లి మండలంలోని చింతలచెర్వు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రిని పలుసార్లు సంప్రదించి ఒత్తిడి చేసిన ఫలితంగా నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీటికి సంబంధించిన వివరాలను ఎమ్మెల్యే కూనంనేని శనివారం వెల్లడించారు. సింగభూపాలెం చెరువు ప్రాజెక్టు కట్ట అభివృద్ధితోపాటు సుందరీకరణ చేపట్టి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు రూ. 8.50కోట్లు, చుంచుపల్లి మండలంలోని చింతలచెర్వు ఆధునీకరణకట్ట అభివృద్ధికి కోటి రూపాయలు మంజూరు లభించిందని తెలిపారు. ఈ నిధులతో త్వరలో పనులు ప్రారంభమవుతాయని, ఫలితంగా సింగభూపాలెం చెరువు నీటి వృథా అరికట్టడమే కాకుండా నీటి సామర్థ్యం పెరిగి చెరువు పరివాహక రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. సుందరీకరణతో పర్యాటక కేంద్రంగా మారితే ఈ ప్రాంతం అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. చుంచుపల్లి మండలం చింతలచెరువు ప్రతియేటా సమీప ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.


చెరువును పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

చెక్కు చెదరని కట్టడం 'పాలేరు'

- రెండు లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా తట్టుకున్న రిజర్వాయర్
- నవాబ్ అలీ నవాజ్ జంగ్ ఇంజనీరింగ్ నైపుణ్యానికి ప్రతిరూపం
- ఖమ్మం జిల్లా ప్రజల పాలిట వరప్రదాయిని..
- నేడు ఇంజనీర్స్ డే



కూసుమంచి, సెప్టెంబరు 14: మండలంలోని పాలేరు రిజర్వాయర్ ప్రత్యేకతను సంతరించుకుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పాలేరు జలాశయానికి లక్షల క్యూసెక్కుల్లో వరద పోటెత్తింది. చరిత్రలో లేనివిధంగా సుమారు రెండులక్షల క్యూసెక్కుల వరద పాలేరుకు వచ్చింది. గరిష్ట నీటిమట్టం 23అడుగులకు గాను 32 అడుగుల మేర నీరు ప్రవహించింది. మూడు రోజుల పాటు సుమారు 20 టీఎంసీల నీరు పాలేరు జలాశయం నుంచి వరదప్రవాహంగా వచ్చి బయటకు వెళ్లింది. అదే విధంగా మామూలుగా అయితే ఎప్పుడు వరదలు వచ్చినా.. 25 అడుగులు దాటలేదు. అయితే రికార్డు బద్దలు కొడుతూ గరిష్ట నీటి ప్రవాహానికి చేరువలో వరద ప్రవహించింది. పాలేరు చుట్టూ ఉన్న పొలాలతో పాటు పాలేరు, నాయకన్‌గూడెం గ్రామాల్లో చుట్టూ ఉన్న ఇళ్లలోకి నీరు వచ్చింది. ఇటీవల కట్టిన ఆనకట్టలు, రహదారులు మామూలు వరదకే ధ్వంసమైనప్పటికీ.. పాలేరు డ్యామ్‌కు, గేట్లకు ఎటువంటి ప్రమాదం తలెత్తకుండా చెక్కు చెదరలేదు. ఇంతటి మహత్తర ప్రాజెక్టు నిర్మాణం చేసింది నవాబ్ అలీ నవాజ్‌జంగ్.

తుమ్మల కృషితో కరకట్ట నిర్మాణం



మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో పాలేరు జలాశయం ఆనకట్ట నిర్మాణం జరిగింది. 1997 మే 17న కరకట్టపై ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కూసుమంచి వైపు వస్తున్న పెళ్లి ట్రాక్టర్‌ను లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో 17 మంది దుర్మరణం చెందారు. దీంతో అప్పుడు నీటిపారుదలశాఖామంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు కరకట్ట వెడల్పు చేసి అభివృద్ధికి నిధులు మంజూరు చేయించి నిర్మాణం గావించారు. ఇప్పటికీ పాలేరు కరకట్ట చెక్కుచెదరక రక్షణగా ఉంది.

ఆధునిక సాంకేతిక నిపుణులకు స్ఫూర్తి

1922లో ఆరవ నిజాం మీర్ మహబూబ్‌అలీ పరిపాలనకాలంలో చెరువుల నిర్మాణం, వ్యవసాయ విస్తరణ చేపట్టారు. ఈ క్రమంలో ఖమ్మం జిల్లాలో వైరా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. అదే సమయంలో పాలేరు చెరువుపై డ్యామ్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి పునాదిరాయి వేశారు. ఈ ప్రాజెక్టులకు అప్పటి ఇంజనీర్ నవాబ్ అలీ నవాజ్ జంగ్ రూపకల్పన చేశాడు. అప్పుడు నిర్మించిన ఈ కట్టడం ఈనాటికీ చెక్కుచెదరక పోవడం ఆధునిక సాంకేతిక నిపుణులు సహా అందరికీ ఆశ్చర్యం కలిగిస్తుంది. సుదీర్ఘకాల ప్రవాహంలో ఎన్నో ఒడిదుడుకులను తట్టుకుని అది నిలబడిన తీరు అద్భుతం. నవాబ్ అలీ నేర్పు, నైపుణ్యాలకు నిలువుటద్దం. నేటి ఆధునిక సాంకేతిక నిపుణులకు స్ఫూర్తిదాయకం. కేవలం సున్నం రాయిని ఉపయోగించి దీన్ని నిర్మించారు.

అత్యధిక నీటినిల్వ సామర్థ్యం ఉండేలా డ్యాంను డిజైన్ చేశారు. దీనినుంచి ఇప్పుడున్న పాతకాలువ ద్వారా సాగునీరు అందించేవారు. ఈ చెరువు నిర్మాణం కొన్ని సంవత్సరాలపాటు జరిగిందని చెపుతుంటారు. వేలాది మంది కూలీలు సంవత్సరాల పాటు కష్టపడి నిర్మించిన ఈ చెరువు పేరు సంతరించుకుంది. సాగర్ కాల్వను పాలేరు చెరువుకు అనుసంధానించి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మార్చారు. 2.5 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యం ఉంది. పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు. రిజర్వాయర్ నిండితే ఎటువంటి ప్రమాదం లేకుండా వాటంతట అవే పడిపోయేవిధంగా ఫాలింగ్ గేట్లు అమర్చారు. ఇటీవల వచ్చిన వరదలకు కొత్తగా కట్టిన రహదారులు, ఆనకట్టలు కూలిపోయినప్పటికీ.. పాలేరు డ్యామ్ మాత్రం చెక్కు చెదరకపోవడం విశేషం. ఇటీవల ఆధునీకరణ పనుల్లో కొత్త ఫాలింగ్‌గేట్లు ఏర్పాటు చేశారు. ఇలాంటి ఎన్నో ప్రాజెక్టులను రూపకల్పన చేసిన నవాబ్ అలీ నవాజ్ జంగ్‌ను తెలంగాణ సాగునీటిరంగ పితామహుడు అనడంలో ఎలాంటి సందేహం లేదని చెప్పవచ్చు.

నవాబ్ అలీ నవాజ్‌జంగ్

పాలేరు డ్యామ్ స్ఫూర్తిదాయకం



మంగళంపూడి వెంకటేశ్వర్లు, నీటిపారుదలశాఖ ఈఈ

పాలేరు డ్యామ్ నిర్మాణం ఆధునిక సాంకేతిక నిపుణులకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. నిజాంకాలంలో ఆరోజుల్లో సాంకేతికత అంత అభివృద్ధి లేకపోయినా అద్భుతంగా నిర్మించారు. అప్పట్లో అంత టెక్నాలజీ లేకున్నా చక్కగా నిర్మించారు. మిషనరీ లేకున్నా మానవుల సాయంతో అంత అద్భుత కట్టడం నిర్మించడం నేటి ఇంజనీరింగ్ నిపుణులకు ఆదర్శంగా నిలుస్తుంది. కరకట్ట నిర్మాణం కూడా అద్భుతంగా నిర్మించారు.

క్రైం సమాచారం

పాలేరు జలాశయంలో పడి
భగీరథ ఆపరేటర్ మృతి

కూసుమంచి, సెప్టెంబరు 14: పాలేరు జలాశయంలో ప్రమాదవశాత్తు పడి మిషన్ భగీరథ ప్రాజెక్టు వాల్ ఆపరేటర్ షేక్ సలీం(32) మృతిచెందాడు. ఈనెల 13న మిషన్ భగీరథలో డ్యూటీకి వెళ్లిన సలీం తిరగి ఇంటికి రాలేదు. ఈక్రమంలో గ్రామంలోనూ బంధువుల ఇళ్లలోనూ వెతికారు. కాగా శనివారం మధ్యాహ్నం మత్స్యకారులకు పాలేరు జలాశయంలో మృతదేహం తేలియాడుతూ కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో బయటకు తీసి మృతుని ఆరా తీయగా పాలేరుకు చెందిన సలీంగా గుర్తించారు. ఈమేరకు మలవిసర్జనకు వెళ్లి ప్రమాదవశాత్తు పడిపోయిఉంటాడని, తన భర్త మృతిపై ఎటువంటి అనుమానాలు లేవని మృతుని భార్య రుబీనా ఫిర్యాదుమేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి బలవన్మరణం

ములకలపల్లి, సెప్టెంబరు 9: ములకలపల్లి మండలం ఆనందపురం గ్రామశివారు మామిడితోట ఎదురుగా ఉన్న చెట్టుకు ఓ వ్యక్తి శనివారం ఉరి వేసుకుని మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆనందపురం గ్రామ శివారులో చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. గ్రామ కార్యదర్శి రాంబాబు ఫిర్యాదు మేరకు ములకలపల్లి ఎస్ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మంత్రాలు చేసే వ్యక్తులపై కేసు

మణుగూరు, సెప్టెంబరు 14: మంత్రాలు చేసి డబ్బులు దండుకునే ఓ వ్యక్తిపై మణుగూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. మండలంలోని తిర్లాపురం బెస్తగూడెం గ్రామంలో చింతల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి కుమార్తె అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో అదే గ్రామంలో ఉండే నాగరాజు అనే వ్యక్తి కుమార్తె ఆరోగ్యం బాగు చేస్తానని రూ. 15 వేలు తీసుకున్నాడు. తర్వాత రెండు వేలు అడిగాడు.. ఇక వెంకటేశ్వర్లు కుమార్తె ఆరోగ్యం మెరుగు పడకపోయే సరికి ఆమెకు చేతబడి చేశారని నయం చేసేందుకు లక్ష రూపాయాల వరకు ఖర్చు అవుతుందని నాగరాజు తెలిపాడు. నాగరాజుకు బంధువైన పోతురాజుకూడా పూజా కార్యక్రమాల్లో పాలుపంచుకునే వాడు. కూతురు ఆరోగ్యం పాడైపోవడం ఓ వైపు, పూజలు చేసే వీరి ఒత్తిడి మరో వైపు తట్టుకోలేక వెంకటేశ్వర్లు పోలీసులను ఆశ్రయించి నాగరాజు, పోతురాజులపై ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుతెలిపారు.

సాగుచేసిన పత్తి పైరు మాయం

చంద్రుగొండ, సెప్టెంబరు 14: ఎకరం పోడు భూమిలో సాగు చేసిన పత్తి పైరు పీకివేసి ఆ మొక్కలను కనపడకుండా చేసిన సంఘటన మండలంలో బాల్యాతండా శివారులో చోటు చేసుకుంది. బాధిత రైతు భూక్య మిట్టు తెలిపిన వివరాల ప్రకారం తనకు ఉన్న మూడున్నర ఎకరాల పోడు భూమిలో పత్తి పంట సాగు చేశాడు. కాగా శనివారం ఉదయం చేనులోకి వెళ్లగా చూడగా ఎకరం భూమిలో పత్తి మొక్కలు కనిపించలేదు. కొంత కాలంగా ఈ భూమిపై అటవీ అధికారులకు రైతు మిట్టుకు వివాదం కొనసాగుతుంది. ఈ క్రమంలో అటవీ అధికారులే తన పంటను పీకివేసి కనబడకుండా చేశారని రైతు ఆరోపిస్తున్నాడు. ఈ దీనిపై చంద్రుగొండ రేంజ్ అధికారి ఎల్లయ్యను వివరణ ఇస్తూ రైతు మిట్టు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు.

25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబరు 14: యర్రగుంట గ్రామ సమీపలో శుక్రవారం రాత్రి ట్రాక్టర్‌లో తరలిస్తున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ చంద్రశేఖర్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. గుంపెన పంచాయతీకి చెందిన రాజేష్, అజీమ్ అనే వ్యక్తులు గుంపెన రేషన్ షాపు నుంచి 25 క్వింటాళ్ల బియ్యాన్ని ట్రాక్టర్‌లో తరలిస్తుండగా తనిఖీ చేసి పట్టుకున్నట్లు తెలిపారు.

అక్రమంగా నిలువ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత

ఇల్లెందురూరల్: ముకుందాపురంలో అక్రమంగా నిల్వఉంచిన 12క్వింటాల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజు

చుంచుపల్లి, సెప్టెంబరు14: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు సూచించారు. శనివారం చుంచుపల్లి పోలీస్ స్టేషన్ పై అంతస్తులో జిల్లా సైబర్ క్రైమ్ కో-ఆర్డినేషన్ సెంటర్‌ను ప్రారంభించి మాట్లాడారు. సైబర్ నేరాల బారిన పడకుండా బాధితులకు అండగా ఉండేందుకు సైబర్ పోలీసులు అందుబాటులో ఉంటారని అన్నారు. ఈ పోలీస్ స్టేషన్‌లో జిల్లా వ్యాప్తంగా 28 సైబర్ వారియర్స్‌లను కేటాయించామని తెలిపారు. ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సైబర్ రహిత సమాజం కోసం కృషి చేయాలని కోరారు. ఎవరైన సైబర్ నేరగాళ్ల బారిన పడి నగదును కోల్పోయినట్లు అయితే టోల్ ఫ్రీ నెంబర్ 1930 ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 265 కేసులు నమోదు చేసినట్లు రూ.2.62 కోట్లు సైబర్ నేరగాళ్ల అకౌంట్‌లో నుంచి బాధితులకు అందజేశామన్నారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అపరేషన్ పంకజ్ పరితోష్, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, శ్రీనివాస్, చుంచుపల్లి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, కొత్తగూడెం వన్‌టౌన్, టూటౌన్ ఇన్‌స్పెక్టర్లు కరుణాకర్, రమేష్, పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సీసీఎస్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

యువకుడి మృతదేహంతో
రైతు ఇంటి ఎదుట ఆందోళన

- పరిహారం చెల్లించాలని డిమాండ్


కాకర్లలో రైతు ఇంటి ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

జూలూరుపాడు, సెప్టెంబరు14: కాకర్ల గ్రామానికి చెందిన బాసిపోయిన సాయికృష్ణ(22) అనే యువకుడు గత 15 రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన ఓ రైతు వరిపొలంలో కలుపు మందును పిచికారి చేసి అనారోగ్యం పాలైయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు కొత్తగూడెం, ఖమ్మంలో ఆసుపత్రుల్లో చికిత్స అందించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ యువకుడు శనివారం సాయంత్రం కొత్తగూడెంలోని ఆసుపత్రిలో మృతి చెందాడు. అతడి కుటుంబ సభ్యులు యువకుడి మృతదేహాన్ని కాకర్ల గ్రామంలోని రైతు ఇంటి ఎదుట పెట్టి ఆందోళన చేపట్టేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. దీంతో మృతదేహాన్ని అంబులెన్స్‌లోనే ఉంచి తమకు పరిహారం చెల్లించాలని కోరుతూ రైతు ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో విషయం తెలుసుకున్న ఎస్ఐ రాణా ప్రతాప్ తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కుటుంబ సభ్యులకు నచ్చ చెప్పి ఆందోళన విరమించారు. యువకుడి మృతదేహాన్ని పోస్ట్ మార్టన్ నిమిత్తం కొత్తగూడెంలోని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి తల్లి దండ్రులు రమేష్ - మారేశ్వరీతో పాటు, సోదరుడు ఉన్నారు.

విద్యుత్ మోటార్ల రాగితీగ చోరీ

- ఏకకాలంలో 60 మంది రైతుల మోటార్ల ధ్వంసం
- సాగునీటి సరఫరాకు అంతరాయం

కల్లూరు, సెప్టెంబరు 14 కల్లూరు మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామ సమీపాన సాగర్ ఎడమకాల్వ గట్టుపైన సాగునీటి సరఫరాకు సంబంధించి తమ పంట పొలాలకు రైతులు ఏర్పాటు చేసుకున్న వ్యవసాయ విద్యుత్ మోటార్ల రాగి వైరును శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు చోరీ చేశారు. ఇలా ఏక కాలంలో సాగర్ కాల్వ గట్టుపైన 1కి.మీ. దూరంలో ఇరువైపుల గల 5 హెచ్‌పీ సామార్థ్యంగల 60 విద్యుత్ మోటర్ల వైరు చోరి కావటం పట్ల బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలోని లక్ష్మీపురం, కప్పల బంధం, కొత్తబోడెమెల్లి గ్రామాలకు చెందిన సన్న, చిన్నకారు రైతులు సాగర్ ఎడమకాల్వ గట్టుపై మోటార్లను ఏర్పాటు చేశారు. కాల్వపైన గల పలు విద్యుత్ ట్రాన్‌ఫారంల ద్వారా విద్యుత్ సరఫరాకు మోటార్లకు విద్యుత్ బోర్డులను ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి కాల్వ గట్టుపై తమ పంట పొలలకు అనుసంధానం గల మోటర్ల కాపర్ వైరును గుర్తు తెలియని దొంగలు చోరీ చేశారని బాధిత రైతులు చెప్పారు. ఇలా 60 మోటర్లకు సంబంధించి 1200 మీటర్ల రాగి వైరు చోరీ అయిందని వారు వివరించారు. వీటి విలువ సుమారు రూ. 3 లక్షల వరకు ఉంటుందని బాధిత రైతులు పుచ్చకాయల సత్తిరెడ్డి, శీలం శ్రీనివాసరెడ్డి, వాసిరెడ్డి హనుమంతరావు, సాంబశివరావు తెలిపారు.


తీగలను కత్తిరించినట్లు చూపుతున్న రైతులు

భక్తులకు ఇబ్బందులు రాకుండా...
గణేశ్ నిమజ్జనం

మేయర్, సీపీ, కమిషనర్

ఖమ్మం సంక్షేమవిభాగం,సెప్టెంబరు14: గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించే గణేశ్ శోభాయాత్రతో పాటుగా నిమజ్జన కార్యక్రమానికి భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని మేయర్ పునకొల్లు నీరజ, పోలీసు కమిషనర్ సునీల్‌దత్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఇంజనీరింగ్ అధికారులకు, సంభాద్రి ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. శనివారం మున్నేరు పరివాహకంలోని కాల్వొడ్డు, ప్రకాశ్‌నగర్‌లోని గణేష్ నిమజ్జన ప్రాంతాలలో ఏర్పాట్లును వారు తనిఖీ చేశారు. ఇటీవల ఏర్పాడిన మున్నేరు వరద పోటుతో ధ్వంసమైన రహదారులను పరిశీలించారు. రహదారులకు అడ్డుగా చెట్ల కొమ్మలు, తీగలు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్రేన్లు, ఫ్లడ్ లైట్లు, బారికేడింగ్ ఏర్పాట్లుపై పలు సూచనలు చేశారు. నిమజ్జన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పోలీసు కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం జరపాలని సూచించారు. ప్రతి ఒక్కరు మన్వయంతో పనిచేస్తేనే ప్రశాంతంగా కార్యక్రమం జరుగుతుందని సూచించారు. ఏడీసీపీ నరేశ్ కుమార్, ఏసీపీ రమణమూర్తి, ఈఈ కృష్ణలాల్, డీఈ మాధవి, స్తంభాద్రి ఉత్సవ కమిటి సభ్యులు గెంటేల వద్యాసాగర్, వినోద్ లాహోటీ, కీసర జైపాల్ రెడ్డి, అల్లిక అంజయ్య, కన్నం ప్రసన్నకృష్ణ, వేల్పుల సుధాకర్, మాటేటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సైబర్ క్రైం నిందితుడి అరెస్ట్

దుమ్ముగూడెం, సెప్టెంబరు 14: జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన బిదుర్ మహతో అనే సైబర్ క్రైమ్ నిందితుడిని దుమ్ముగూడెం పోలీసులు శనివారం అరెస్ట్ చేసి భద్రాచలం కోర్టులో హాజరుపర్చారు. పెదబండిరేవుకు చెందిన చాందిని ఓ నకిలీ వెబ్‌సైట్‌లో చీరను కొనుగోలు చేశారు. అది నచ్చకపోవడంతో రిటర్న్ చేసేందుకు సంబంధిత వెబ్‌సైట్ కస్టమర్ కేర్‌ను సంప్రదించారు. డబ్బులు రిటర్న్ చేస్తామని చెప్పి నమ్మించి చాందిని యూపీఐ పిన్‌ను సేకరించారు. వెంటనే ఆమె బ్యాంకు ఖాతా నుంచి రూ.5వేలను తస్కరించారు. చాందిని ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు హైదరాబాదు సైబర్‌క్రైమ్ పోలీసులు అప్పటికే అరెస్ట్ చేసిన బిదుర్ మహతోను అదుపులోకి తీసుకున్నారు. కస్టమర్ కేర్ నంబర్లకోసం గూగుల్ సెర్చ్ చేయకూడదని, కేవైసీ అప్‌డేట్ పేరిట వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదని, సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫిర్యాదు చేయాలని ఎస్ఐ గణేష్ సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చింతకాని, సెప్టెంబరు 14: మండల పరిధిలోని నాగులవంచ గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో కంభం నాగేశ్వరరావు (48) మృతిచెందారు. గ్రామానికి చెందిన మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కంభం నాగేశ్వరరావు, కిరాణ దుకాణం నిర్వాహకుడు వేముల శ్రీనివాసరావు ఇద్దరూ కలసి శుక్రవారం రాత్రి సమయంలో భోజన అనంతరం వాకింగ్‌కు గ్రామ సమీపంలోని విద్యుత్తు ఉపకేంద్రం వైపు వెళ్లారు. వారిద్దరినీ వెనుక నుంచి వచ్చిన ఓ ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో నాగేశ్వరరావు చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. అతనితో నడకకు వెళ్లిన మరో వ్యక్తి శ్రీనివాసరావు కుడికాలు విరిగింది. మృతుడు నాగేశ్వరరావు భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకె ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జామాయిల్ చెట్లు నరికివేత

- ముగ్గురిపై కేసు నమోదు


పట్టుబడిన ట్రాక్టర్

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 14: అక్రమంగా జామాయిల్ చెట్లను నరికి తరలించేందుకు సిద్ధమైన ముగ్గరిపై అటవీశాఖ అధికారులు దాడులు నిర్వహించి ట్రాక్టర్‌ను సీజ్‌చేసి ముగ్గురిపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే మండలంలోని నారాయణపురం బీట్‌లోని గుంటిమడుగు జామాయిల్ ప్లాంటేషన్‌లో ఆసుపాక గ్రామానికి చెందిన రామకృష్ణ, రాము, పవన్ అనే వ్యక్తులు అక్రమంగా చెట్లను నరికారు. సమాచారం అందుకున్న రేంజర్ మురళీ ప్లాంటేషన్ వద్దకు వెళ్లి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. అప్పటికే నరికిన 12 చెట్లను తరలించేందుకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. ట్రాక్టర్,కలపను అటవీశాఖ కార్యాలయానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు 14: కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. బస్టాండ్ సెంటర్ వద్ద ఇసుక ట్రాక్టర్లను పోలీసులు గుర్తించి స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.



శిక్షణ తీసుకుంటున్న ఉపాధ్యాయులు(ఫైల్)

సక్సెస్ దిశగా

డైట్ కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్...

- అత్యుత్తమ ఉపాధ్యాయ శిక్షణ కేంద్రంగా టేకులపల్లి డైట్
- ఎలిమెంటరీ విద్యలో శిక్షణ ఇస్తున్న సంస్థ
- అభివృద్ధి కోసం రూ.10.50 కోట్లు మంజూరు
- వెంటాడుతున్న సిబ్బంది కొరత

ఖమ్మం ఖానాపురంహవేలి, సెప్టెంబరు 14: ఖమ్మం జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో ప్రతీ సంవత్సరం డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సులో 100 మందికి అడ్మిషన్లు కల్పిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాల టీచర్లకు వివిధ సబ్జెక్టుల్లో వృత్యాంతర శిక్షణ ఇవ్వడంలో టేకులపల్లిలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఉమ్మడి జిల్లాలో అభ్యర్థులను ఉపాధ్యాయ శిక్షణ ఇచ్చే సంస్థ అధ్యాపకుల కొరతతో సతమతమవుతోంది. 25 మంది రెగ్యులర్ అధ్యాపకులకు గాను కేవలం ఇద్దరే ఉన్నారు. వారిలో ఒకరు (సోమశేఖర శర్మ) డీఈవోగా డిప్యూటేషన్‌లో ఉండగా మరొకరు ప్రిన్సిపాల్ సత్యనారాయణ మాత్రమే ఎనిమిది మంది అతిథి అధ్యాపకులతో శిక్షణను అందిస్తున్నారు.

కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా గుర్తింపు..

ఇటీవల ఈ డైట్‌ను కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తమ విద్యా సంస్థల్లో ఒకటిగా గుర్తించాయి. డిజిటల్ సదుపాయాలతో ల్యాబ్‌లు, సెమినార్ హాళ్లు ఉపాధ్యాయులకు, అంగన్‌వాడీ టీచర్లకు అన్ని రకాలుగా శిక్షణ కల్పించేలా ప్రత్యేక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. త్వరలోనే ఈ డైట్‌లో ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సు ఏర్పాటు చేయనున్నారు. డైట్ అభివృద్ధికి రూ.10.50 కోట్ల నిధులను మంజూరు అయ్యాయి

10 ఎకరాలలో కళాశాల ప్రాంగణం

జిల్లా విద్యా శిక్షణ సంస్థ ఖమ్మంలోని టేకులపల్లిలో 10 ఎకరాలు సువిశాల ప్రాంగణంలో 1989లో ప్రారంభమైంది. ఇటీవల విడుదలైన నిధులలో ఆడిటోరియం తోపాటు డిజిటల్ సదుపాయాలతో సెమినార్ హాళ్లు, లెక్చర్ హాళ్లు, సైన్స్ ల్యాబ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌లు, మ్యాథ్స్, ఇంగ్లీష్, తెలుగు ల్యాబ్‌లు, డిజిటల్ లైబ్రరీ, సోలార్ ప్యానెల్స్, కళాశాల మేజర్, మైనర్ రిపేర్లు చేయనున్నారు.

ప్రిన్సిపాల్‌కు, సిబ్బందికి క్వార్టర్స్, కళాశాలకు రక్షణగా చుట్టూ 10 అడుగుల ఎత్తుతో ప్రహరీ నిర్మిస్తారు. ఇంటర్నల్ రోడ్లు, బాలబాలికలకు వేర్వేరు వసతి గృహాలు నిర్మించేలా ప్రతిపాదనలు రూపొందించారు.

మరింత మందికి శిక్షణకు అవకాశం

సామినేని సత్యనారాయణ, ప్రిన్సిపాల్,



రానున్న రోజుల్లో డైట్ కళాశాలలో అభివృద్ధి పనులు పూర్తయితే మరింత మందికి శిక్షణ అందించేందుకు అవకాశం ఉంది. కళాశాలలో ఉపాధ్యాయులకు అన్ని రకాల శిక్షణ ఇస్తున్నాం. సీవోఈగా ఎంపికైన ఈ కళాశాలను రాష్ట్రంలో ఆదర్శ శిక్షణ కేంద్రంగా తీర్చిదిద్దుతాం. ఉపాధ్యాయులకు తొలిమెట్టు, ఉన్నతి, ప్రధానోపాధ్యాయులకు లీడర్‌షిప్ అంశాలపై శిక్షణ కల్పిస్తున్నాం.



ఇంత వరదను ఏనాడూ చూడలేదు..

- సహాయ కార్యక్రమాల్లో పాలుపంచుకున్నా
- 'ఆంధ్రజ్యోతి'తో ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మం సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'ఆకేరు మున్నేరు వరదలు ఈ స్థాయిలో ఏనాడూ చూడలేదు.. ఆకేరుపై పాత బ్రిడ్జికింది వరకు నీరు వచ్చిందని మానాన్నగారు చెబితే విన్నాను.. కానీ ఇప్పుడు ఆకేరు, మున్నేరు కు అతిపెద్ద వరద వచ్చి నష్టం జరిగింది..' అని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి తెలిపారు. వరద సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నఆయన 'ఆంధ్రజ్యోతి'తో శనివారం మాట్లాడారు. 31 రాత్రి భారీవర్షం పడింది. మున్నేరు పరివాహకం లో ఎప్పుడులేనంతగా భారీవర్షాలు రావడబతో తెల్లారి ఉదయం 7-30కే ఫోన్ వచ్చింది. ఆకేరు పొంగుతుంది ఊళ్లలోకి నీరు వచ్చాయని, అప్పటికే నేను టూర్‌కు వెళదామని ఖమ్మం ఇంటి వద్ద సిద్ధంగా ఉన్నా. సరే మున్నేరు చూద్దామని వెళ్లే లోపే కరుణగిరి వద్ద కాలనీల్లోకి నీరు వచ్చాయని వెంటనే కలెక్టర్, సీపీకి ఆకేరు వరద అధికంగా వస్తుంది. మున్నేరు భారీగా పెరుగుతుంది.వరద ఎక్కువ వచ్చే అవకాశం ఉందని ఫోన్‌లోనే చెప్పా. బ్రిడ్జిపై కూడా ట్రాఫిక్ జాం అయ్యే పరిస్థితి ఉంది. భారీవాహనాలు వస్తున్నాయి. పోలీసులను వెంటనే ఖమ్మం బైపాస్‌బ్రిడ్జిపై బందోబస్తు ఏర్పాటుచేయాలని సూచించడం జరిగిందన్నారు.

మున్నేరు పొంగడంతో అనేక గ్రామాలు నష్టం జరిగిందని, ఇళ్లన్నీ దెబ్బతిన్నాయని ఎవరింటికివెళ్లినా వరద వస్తుంది చూడండి సారు మా ఇల్లు మునుగుతుందని చెప్పారని వరదల తగ్గి ఇంటికి వెళ్లేవారు సహాయ కార్యక్రమాల్లో ఉన్నానని గుర్తుచేశారు. జిల్లాలో జరిగిన వరద నష్టాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయా శాఖల కేంద్రమంత్రులను కూడా కలిసి వరద నష్టం గురించి తెలుపుతానన్నారు. రాష్ట్రంనుంచి ఎంపీ బృందంకూడా ముఖ్యమంత్రి దేశాలతో ఢిల్లీ వెళ్లి కేంద్రం దృష్టికి తీసుకెళతానని చెప్పారు. కేంద్రం బృందం పర్యటించి వెళ్లినందున కేంద్రం నుంచి అధికంగా వరద సాయం పొందేందుకు కాంగ్రెస్ పార్లమెంట్ పక్షం తరుపున ఎంపీగా తన వంతు కృషిచేస్తానని తెలిపారు.

ముగిసిన ధ్రువపత్రాల శిబిరాలు

- 450 దరఖాస్తులు స్వీకరణ... ఆన్‌లైన్ ప్రక్రియ షురూ



దరఖాస్తులు తీసుకుంటున్న దృశ్యం

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 14: మున్నేరు వరదల్లో ధ్రువపత్రాలు కోల్పోయిన విద్యార్థులు, నిరుద్యోగులు, ఇతరులకు తిరిగి అందించేందుకు బాధితుల కోరిక మేరకు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాలతో కమిషనర్ అభిషేక్ అగస్త్య పర్యవేక్షణలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియకు చేపట్టారు. మొత్తం 14 డివిజన్లు ముంపునకు గురి కాగా ఆయా ప్రాంతాల్లో 8 కౌంటర్లను ఏర్పాటు చేశారు. సెప్టెంబరు 10 నుంచి దరఖాస్తులు స్వీకరణ ప్రారంభించారు. శనివారంతో క్యాంపులు ముగిశాయి. మొత్తం 450 దరఖాస్తులు అధికారులకు అందాయి. వీటిలో ఎక్కువగా విద్యా సంబంధిత ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తులు వచ్చాయి. 46వ డివిజన్‌లో 75, 47వ డివిజన్‌లో 84, 48వ డివిన్‌లో 70, 11లో 17, 16లో 79, 17లో 0, 49లో 1, 30లో 20, 28లో 3, 29లో 3, 59లో 29, 60లో 17,34లో 2, 35లో 50 దరఖాస్తులు అందాయి. కాగా వచ్చిన దరఖాస్తులను కేఎంసీ అధికారులు ఆన్‌లైన్ చేసి సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ద్వారా పంపనున్నారు.

ఎన్నారై ఫౌండేషన్ సేవలు స్ఫూర్తిదాయకం

- జాయింట్ కలెక్టర్ మధుసూదన్ నాయక్
- ఘనంగా ఎన్ఆర్ఐ ఫౌండేషన్ 10వ వార్షికోత్సవం



ట్రై సైకిళ్లను అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఖమ్మం ఖానాపురంహవేలి, సెప్టెంబరు 14: పేదరికంతో బాధపడుతూ చదువులకు దూరమవుతున్న విద్యార్థుల తలరాతలు మార్చేందుకు ఎన్నారై ఫౌండేషన్ అందిస్తున్న స్ఫూర్తిదాయకమని జాయింట్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ అన్నారు. నగరంలోని స్వర్ణభారతి కళ్యాణ మండపంలో శనివారం నిర్వహించిన ఎన్నారై ఫౌండేషన్ పదో వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల, మహిళల సాధికారత కోసం ,దివ్యాంగుల అభ్యున్నతి కోసం ఫౌండేషన్ సేవలు ప్రతి ఒక్కరిలో మార్పులు తీసుకొని వస్తున్నాయని డిప్యూటీ పోలీస్ కమిషనర్ నరేష్ కుమార్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడానికి సంస్థ సేవలు ఎంతో దోహదం చేస్తున్నాయని డీఈవో సోమశేఖర్ శర్మ అన్నారు. ఎన్నారై ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు బోనాల రామకృష్ణ, యూఎస్ కోర్ కమిటీ సభ్యులు హరినాథ్ దొడ్డపనేని మాట్లాడుతూ 'నేను నాదేశం అనేస్ఫూర్తి'తో మన ప్రాంతాల అభివృద్ధికి సేవలు చేస్తున్నామని అన్నారు. ఎన్ఆర్ఐ ఫౌండేషన్ యూఎస్ కోర్ కమిటీ సభ్యుడు బాబు బయ్యాన అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో జిల్లా ప్రధాన కార్యదర్శి బండి నాగేశ్వరరావు కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టగా, బాధ్యులు పసుమర్తి రంగారావు, దండ్యాల లక్ష్మణ్, తుమ్మల యుగంధర్, పద్మశ్రీ వనజీవి రామయ్య, అన్నం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈసభలో ప్రభుత్వ పాఠశాలల 200 మంది విద్యార్థులకు సైకిళ్లు, నలుగురికి లాప్‌టాప్‌లు, పది మందికి ఉపకారవేతనాలు, వరద బాధిత పాఠశాలల విద్యార్థులకు సహాయక కిట్స్, మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు.

ఘనంగా ఓనం వేడుకలు



అలంకరించిన రంగవల్లికలు

కల్లూరు, సెప్టెంబరు 14: కల్లూరు పట్టణంలో శనివారం పలువురు కేరళీయన్లు ఘనంగా ఓనం పండుగ వేడుకలు జరుపుకొన్నారు. దక్షిణ భారతదేశ రాష్ట్రమైన కేరళలో అతిపెద్ద పండుగగా కేరళీయన్లు ఓనం పండుగను జరుపుకొంటారు. కల్లూరులోని సెయింట్ మైఖేల్ (లెమర్) పాఠశాల ప్రాంగణానికి పలువురు కేరళ భక్తులు తరలి వచ్చి ఆనందోత్సవాలతో ఈ పండుగ సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కేరళ భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించారు. మహాబలి అనే రాజు ప్రతి ఒక్క మలయాళీ కుటుంబానికి వచ్చి కలుస్తాడని కేరళ ప్రజల విశ్వాసం. ఈ పండగ రోజే పంటలు ప్రతి ఇంటా కేరళలో చేరుతాయి. సదరు పాఠశాల ప్రాంగణంలో కేరళ భక్తులు ఆకర్షణీయంగా రంగవల్లికలను అలంకరించారు.

చిన్నారుల ఉయ్యాల ఊపారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో కేరళ భక్తులు గిరీష్, పాఠశాల హెచ్‌ఎం టీహెచ్ అబ్బాస్, శైలజ, కన్యకుమారి, జమాల్, అంజుమన్ తదితరులు పాల్గొన్నారు.

నాటి పెళ్లిలా నేటి పెండ్లిరోజు వేడుక

- గత సంప్రదాయం ఉట్టిపడేలా పెండ్లి రోజు జరుపుకొన్న దంపతులు
- సీన్ రీ కన్‌స్ట్రక్షన్‌తో 50వ వివాహ వార్షికోత్సవం సోషల్ మీడియాలో వైరల్



ఖమ్మంమార్కెట్ , సెప్టెంబరు 14: పెళ్లి సంస్కృతి, సంప్రదాయాలతో ముడిపడి ఉంది. కానీ ఇటీవల వివాహాలలో వెనకటి సంప్రదాయం కనుమరుగైంది. అప్పటి సంస్కృతి, వివాహ ఆచార వ్యవహారాలను నేటి తరానికి చూపించాలనే ఉద్దేశ్యంతో 50 వ పెండ్లి రోజు వేడుకలను విభిన్నంగా జరుపుకొన్నారు దంపతులు. ఆగస్టు 14వ తేదీన జరిగిన ఈ వేడిక కాస్త ఆలస్యంగా వెలుగులోకి వచ్చినా సదరు దంపతుల సీన్ రీ కన్‌స్ట్రక్షన్‌తో చేసిన 50వ వివాహ వార్షికోత్సవ వేడుక సోషల్ మీడియాలో వైరల్ అయింది. నాటి వారి పెళ్లి తంతును కళ్లకు కడుతూ ఖమ్మం నగరంలోని గాంధీచౌక్‌కు చెందిన ప్రముఖ వ్యాపారి, దాల్ మిల్ సంఘ బాధ్యుడు వేములపల్లి వెంకటేశ్వరరావు, సామ్రాజ్య లక్ష్మి దంపతులు బంధు మిత్రుల సమక్షంలో కన్నుల పండుగగా పెండ్లి రోజు వేడుకలను జరుపుకోవడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. వారికి 1974లో వివాహం జరిగింది. సంతానం ముగ్గురు కూతుర్లు, పది మందికి పైగా మనుమలు, మనుమరాళ్లు కూడా. వయస్సు కూడా 70 సంవత్సరాలను టచ్ చేసింది. ఇక తమ 50వ పెండ్లి రోజును ఆ నాడు జరిగినట్లుగానే నాటి జ్ఞాపకాలతో మొదలెట్టారు. మొదటగా పెళ్లి తంతుగా పెళ్లి చూపులు, వరుడి, వధువు తరుపున బంధువులు ఎదురెదురుగా కూర్చొని సరదా సంవాదాలు కొనసాగించారు. ఒకరిపై ఒకరు హాస్య చలోక్తులు విసురుకున్నారు. పెళ్లి చూపులకు ఐదారుగురు వస్తారనుకుంటే ఇంత మంది వచ్చారేంటి అని ఒకరిపై ఒకరు హాస్యమాడారు. అందుకు పెండ్లికొడుకు తరుపువారు మేం ఎంతమంది వస్తే మాత్రం మాకు మర్యాదలు చేయరా అంటూ ప్రశ్నించడం, పెళ్లి కూతురుని ముస్తాబుగా కూర్చో పెట్టడం, పెళ్లికూతురికి పాటలు వచ్చా, వంటలొచ్చా అని ప్రశ్నలు వేయడం, సమాదానాలు చెప్పడం, కట్నకానుకలు మాట్లాడుకోవడం, నృత్యాలతో సుమారు 100 మంది బంధుమిత్రులతో మూడు రోజుల పాటు వివాహ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించుకొని మరలా పెళ్లిలా వివాహ దినోత్సవాన్ని జరుపుకోవడం అందరినీ సంభ్రమాశ్చర్యాలకు గురి చేసింది.

నియమాలకు కట్టుబడి జీవితం గడపాలి

జేఐహెచ్ రాష్ట్ర కార్యదర్శి నయిముద్దీన్

ములకలపల్లి, సెప్టెంబరు 14 : మానవజీవితం సుఖసంతోషాలతో సాగాలంటే మనిషి దైవం నిర్దేశించిన కట్టుబాట్లు, నియమాలను అనుసరించాలని జమాతె ఇస్లామి హింద్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి నయిముద్దీన్ అహ్మద్ అన్నారు. శనివారం మండల పరిధిలోని జగన్నాథపురంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటి సమాజంలో చాలామంది విలువల్ని విస్మరించి ఇష్టానుసారం జీవించడం వల్లనే అనేక దుర్మార్గాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ప్రతి ఒక్కరు నేను.. నా కుటుంబం అని మాత్రమే ఆలోచిస్తున్నారు తప్ప నా సోదరుడు. నా ఇరుగు పొరుగు పరిస్థితులేమిటి.. సమాజం పట్ల మన బాధ్యత ఏమిటి అని ఆలోచించడం లేదని తెలిపారు. ఇటీవల భారీ వర్షాల కారణంగా వరదలకు అనేక కుటుంబాలు అతలాకుతలమయ్యాయని, అలాంటి వారికి సహాయం అందించడం మన బాధ్యత అన్నారు. జేఐహెచ్ తన శక్తిమేర సహాయక పనుల్లో నిమగ్నమై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జేఐహెచ్ జిల్లా అధ్యక్షులు ఫారూఖ్‌యజ్దానీ, సహయ కార్యదర్శి తాజుద్దీన్, మహిళా అధ్యక్షురాలు పర్వీన్ ముస్తఫా, ఎండి. ఉస్మాన్‌ఖాన్, జరీనా, తస్లీం, రహీమున్నీసా, జబ్బార్, షరీఫ్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రిలో ఖగోళయాత్ర ముగింపు

భద్రాచలం, సెప్టెంబరు 14: ప్రపంచ శాంతికోసం శ్రీరామ టెంపుల్ ఆఫ్ యూఎస్ఏ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖగోళ యాత్ర ముగింపు కార్యక్రమం దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచల పుణ్యక్షేత్రంలో నిర్వహించనున్నారు. ఆగస్టు 17న యూపీలోని అయోధ్య నుంచి ప్రారంభమైన ఖగోళ యాత్ర మంగళవారం సమాప్తి కానుంది. ఖగోళ యాత్రను పురస్కరించుకొని ప్రపంచంలోని కంబోడియా, ఆస్ట్రేలియా, సౌత్ ఆఫ్రిక, అర్జెంటీనా, యుఎస్ఎ. ఐస్‌లాండ్, జపాన్ తదితర దేశాల మీదుగా సాగింది.

పెండింగ్ ఫైళ్లను పూర్తిచేయాలి

- సింగరేణి డైరెక్టర్ (పా) వెంకటేశ్వర రెడ్డి

కొత్తగూడెం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరగా పూర్తి చేయాలని సింగరేణి డైరెక్టర్ పా వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. శనివారం ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2వ తేదీ నుంచి 31వ తేదీ వరకు సింగరేణి మైన్స్, డిపార్టుమెంట్ల వద్ద స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో స్వచ్ఛత కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, అందుకు సంబంధించిన ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఆదేశించారు.

బూడిద తరలింపునకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం, సెప్టెంబరు 14: పాల్వంచ కేటీపీఎస్ ప్రభావిత ప్రాంతాలైన కరకవాగు, పునుకుల, పుల్లయిగూడెం, సూరారం గిరిజన ప్రాంతాల్లో కేటీపీఎస్ నుంచి వెలువడుతున్న బూడిద తరలింపునకు గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో బి.రాహుల్ తెలిపారు. కాలుష్య ప్రభావిత ప్రాంత అభ్యర్థుల నుంచి ఈ నెల 25 సాయంత్రం 5 గంటల వరకు భద్రాచలం, కేటీపీఎస్ పాల్వంచ వారి ఆఫీసులో పని దినాల్లో రూపొందిచబడిన దరఖాస్తు ఫారంలో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పీవో తెలిపారు. దరఖాస్తు ఫారాలను కేటీపీఎస్ పాల్వంచ, భద్రాచలం ఆఫీసులో పొందాలని కోరారు. పూర్తి వివరాలకు 9490612556, 9490612557, 9441507135 లో సంప్రదించాలని కోరారు.

వరద విపత్తులకు శాశ్వత పరిష్కారం

(3వ పేజీ తరువాయి)

ఇందిరమ్మ ఇల్లు రూ.5లక్షలు ఇస్తాం.. కేంద్రం నుంచి సహాయాన్ని అర్థిస్తున్నాం.' అని చెప్పారు. మంత్రి వెంట నెల్లూరి భద్రయ్య, బోయపాటి నారాయణ,, బోయపాటి రాంబాబు, ఏటుకూరి చిన్న పుల్లయ్య, బచ్చలకూరి నాగరాజు తదితరులు ఉన్నారు.

బాధితులను అన్నివిధాల ఆదుకుంటాం

తిరుమలాయపాలెం మండలంలోని ఆకేరు నదిపై రావిచెట్టుతండా నుంచి మహబూబాబాద్ జిల్లా ధర్మారం వరకు నిర్మించిన బ్రిడ్జి రోడ్డు కొట్టుకుపోవడంతో మంత్రి పొంగులేటి పరిశీలించారు. మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారీవర్షంతో మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టులు, చెరువులు దెబ్బతిన్నాయని వాటికి మరమ్మతులు చేసి రైతులకు సాగునీరు సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. రోడ్లు, విద్యుత్‌శాఖకు భారీనష్టం జరిగిందని వీటికి కూడా మరమ్మతులు చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు వివిధ సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. విద్యుత్‌స్థంబాలు విరిగి పంటలకు, సాగుకు ఇబ్బందిగా ఉందని, రావిచెట్టుతండాలో తాగునీటి సమస్య ఉందని తెలుపగా, చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మద్దినేని బేబీ స్వర్ణ కుమారి, రామసహాయం నరేష్‌రెడ్డి ఆర్డీవో గణేష్, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో సిలార్ మాజీ జడ్పీటీసీ బెల్లం శ్రీను, మాజీ ఎంపీపీ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాలేరులో గండి మరమ్మతు పనుల పరిశీలన

కూసుమంచి మండలంలో సాగర్ ఎడమకాల్వ గండి పూడ్చివేత పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి రైతులకు సాగర్‌నీరు అందించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన హట్యతండా వద్ద సాగర్‌కాల్వ గండి ప్రాంతంలో మరమ్మతులను పరిశీలించారు. గండిపూడిక వివరాలు, తాత్కాలికంగా చేపడుతున్న పనులు ప్రధానకాల్వ స్లాబ్ పునరుద్ధరణ వివరాలను నీటిపారుదలశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు సాగునీరు అందించేందుకు చేపట్టే పనులతోపాటు శాశ్వత పునరుద్ధరణ పనులు కూడా సమాంతరంగా పూర్తిచేయాలని ఆదేశించారు.

కాల్వ గండి పూడ్చివేత యుద్ధప్రాతిపదిక పూర్తిచేసి నాలుగు రోజుల్లో రైతాంగానికి నీరందించాలని తెలిపారు. కార్యక్రమంలో నీటిపారుదలశాఖ ఈఈ మంగళపూడి వెంకటేశ్వర్లు, అనన్య, ఆర్అండ్‌బీ ఎస్ఈ హేమలత, ఖమ్మం ఆర్డీవో గణేష్, ఏడీఏ సరిత, ఖమ్మంరూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి ఇతర అధికారులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు

ఆయిల్‌పామ్ రైతులకు తీపికబురు

- ముడిచమురుపై కేంద్రం దిగుమతి సుంకం పెంపు
- హర్షం వ్యక్తం చేసిన రైతులు, రైతుసంఘం నేతలు



కేంద్రమంత్రికి వినతిపత్రం ఇచ్చిన దృశ్యం

దమ్మపేట, సెప్టెంబర్ 14: రైతు సంఘాల నాయుకుల పోరాటం ఫలితంగా కేంద్రప్రభుత్వం ఎట్టకేలకు ముడిచమురు దిగుమతిపై సుంకం పెంచటంతో రైతులు, రైతు సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో దిగుమతి సుంకం అధికంగా ఉండటంతో టన్ను పామాయిల్ గెలల ధర రూ.24వేలకు చేరగా కేంద్రప్రభుత్వం దిగుమతి సుంకం తగ్గించడంతో పామాయిల్ గెలల ధర 50శాతానికి పడిపోయింది. దీంతో పామాయిల్ రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో రైతు సంఘాల నాయుకులు పలుమార్లు దిగుమతి సుంకం పెంచాలని కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో ఇటీవలే ఖమ్మం వచ్చిన కేంద్రవ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిసి రైతు సంఘాల నాయకులు వినతి పత్రం అందజేసి సమస్యను వివరించారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ముడిచమురుపై దిగుమతి సుంకం పెంపచటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ముడి చమురు దిగుమతులపై సుంకం ప్రభుత్వం పెంచటంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దిగుమతి సుంకం పెంపుపై పామాయిల్ అడ్వజరీ కమిటీ మెంబర్, ఆయిల్‌పాం రైతు సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాద్, కోటగిరి శీతారామస్వామి, బండి భాస్కర్ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సుంకం పెంపునకు కృషి చేసిన కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, రాష్ట్ర వ్యవశాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రైతు సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆపద వేళ అండగా..

(3వ పేజీ తరువాయి)

ప్రజాప్రతినిధిగా అనేక వరద సహాయ కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. ఇటీవల ఖమ్మం జిల్లాలో భారీవర్షాలు కురుస్తున్న సమయంలో తీవ్ర జ్వరంతో ఉన్న ఆయన గతనెల 31న సాయంత్రం అధికారులను అప్రమత్తం చేసి హైదరాబాదు వెళ్లారు. కానీ మరుసటి రోజు ఉదయానికే ఉప్పునలా మున్నేరు వరద పొంగి ఖమ్మం నగరంపై పడడంతో అనేక కాలనీలు ముంపుబారిన పడ్డాయి. దాంతో తీవ్ర జ్వరంతోనే ఆయన ఆ రోజు సాయంత్రానికి ఖమ్మం చేరుకుని మున్నేరు వరద సహాయ కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. ప్రకాష్‌నగర్ బ్రిడ్జిపై చిక్కుకున్న 9మందిని కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. వారిని కాపాడేందుకు హెలికాప్టర్ కోసం రెండు తెలుగు రాష్ట్రాల అధికారులతో మాట్లాడారు. కానీ వాతావరణం అనుకూలించకపోవడంతో హెలీకాప్టర్ ఖమ్మం చేరుకోలేకపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో రాత్రి 10-30గంటల సమయంలో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని రప్పించి బోట్ల సాయంతో వారిని రక్షించే ప్రయత్నిం చేశారు. కానీ అప్పటికే వరద తగ్గుముఖం పట్టడంతో బిడ్జిపై చిక్కుకున్న బాధిధులు ఓ ఎక్స్‌కవేటర్ సహాయంతో బిడ్జికి మరోవైపు నుంచి బటికి వచ్చారు. ఆ మరుసరి రోజునుంచి తుమ్మల ఖమ్మంలో మకాం వేసి జ్వరంతో ఇబ్బంది పడుతూనే వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ బాధితులకు నిత్యావరాలు, తాగునీరు అందేలా చూశారు. ఖమ్మంతో పాటు హైదరాబాద్‌కు చెందిన పలువురు, దాతలు, సేవా సంస్థల ద్వారా భోజనాలు అందించడం, నిత్యావసర కిట్లు, దుప్పట్లు, దుస్తులు, సామగ్రి అందించడం వంటి పనులు చేయించారు.

చురుగ్గా కదలిన డిప్యూటీ సీఎం భట్టి

భారీ వర్షాలు వరదల సమయంలో భట్టి విక్రమార్క తొలిసారి డిప్యూటీ సీఎం హోదాలో చురుగ్గా పాల్గొన్నారు. కట్టలేరు, మున్నేరు, పాలేరు పొంగడంతో ఎర్రుపాలెం, మధిర, చింతకాని మండలాలు దెబ్బతినడంతో అర్థరాత్రి వేళ అధికారులతో కలిసి వరదల్లో చిక్కుకున్నవారిని రక్షించే కార్యక్రమంలో పాల్గొన్నారు. సహాయ కార్యక్రమాల కోసం జిల్లాకు హెలికాప్టర్లు తెప్పించేందుకు ఏపీ అధికారులతో పాటు నేవీ, ఆర్మీ అధికారులతో భట్టి మాట్లాడారు. ఎర్రుపాలెం, మధిరతో పాటు ఖమ్మంలో మున్నేరు వరద సహాయ కార్యక్రమాల్లో భట్టి పాల్గొన్ని బాధితులకు భరోసా ఇచ్చారు. అలాగే కేంద్ర మంత్రులు శివరాజ్‌సింగ్‌చౌహాన్, బండి సంజయ్‌లతో విజయవాడ నుంచి హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వేలో ఖమ్మం, పాలేరు మధిర నియోజకవర్గాల్లో జరిగిన నష్టాన్ని వివరించారు. వరద తగ్గన తర్వాత చింతకాని, మధిర, ఎర్రుపాలెం, బోనకల్, ముదిగొండ మండలాల్లో పర్యటించి రైతులకు, వరద బాధితులకు భరోసా ఇచ్చారు.

తొలిసారి వరద సాయంలో పొంగులేటి

గతంలో ఎంపీగా అధికారిక హోదాలో వరదలను చూసిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తొలిసారి మంత్రి హోదాలో వరద సహాయ కార్యక్రమాల్లో అన్నీతానై బాధితుల వెంట నిలిచారు. రెవెన్యూశాఖ మంత్రిగా వరద విపత్తుల నివారణ ఆయన పరిధిలోకి వస్తుంది. తాను ప్రాతినిథ్యం వహిస్తున్న పాలేరు నియోజకవర్గ పరిధిలోనే మున్నేరు, పాలేరు, ఆకేరు వరదలు మూడువైపులా నష్టాన్ని కలిగించాయి. వరద పెరిగిన విషయం తెలిసిన వెంటనే అన్ని మండలాల్లో పర్యటించారు. తిరుమలాయపాలెం మండలంలోని రాకాసితండాలో చిక్కుకున్న 59మందిని రక్షించేందుకు ప్రత్యేక బోట్లు ఏర్పాటు చేయించారు. పొంగులేటి ఫౌండేషన్ ద్వారా బాధితులకు నిత్యావసరాలు, పునరావాస కేంద్రాల్లో భోజనాలు అందేలా చర్యలు తీసుకున్నారు. వరద తగ్గిన తరువాత ఇంటింటికి ప్రభుత్వం తరపున నిత్యావసరాల కిట్లు అందించడమే కాకుండా తన ఫౌండేషన్ తరుపున కూడా బాధితులకు నిత్యావసరాల కిట్లు పంపిణీ చేశారు. ఎప్పటికప్పుడు పార్టీ నాయకులు, కార్యకర్తలను అప్రమత్తం చేస్తూ వారి ద్వారా సేవా కార్యక్రమాలు అందించారు. మున్నేరు వరదలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు హెలికాప్టర్లు తెప్పించేందుకు మంత్రి పొంగులేటి కూడా తీవ్రంగా ప్రయత్నించారు. వరదలు తగ్గిన తర్వాత కూడా ప్రభావిత గ్రామాలకు వెళ్లి బాధితులకు మనోధైర్యం కల్పించారు.

విద్యుత్ మీటర్లకు దరఖాస్తులు

ఆళ్లపల్లి, సెప్టెంబర్ 14: నూతన విద్యుత్ మీటర్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని గుండాల, ఆళ్లపల్లి మండలాల విద్యుత్‌శాఖ ఏఈ రమేష్ శనివారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు 1 కిలోవాట్‌కు రూ.1779లు, వాణిజ్య మీటర్ కోసం రూ.2720 లు వ్యవసాయ మీటర్ కోసం 5హెచ్‌పీ లోడ్‌కి రూ.5295 రూపాయలతో మీ సేవ సెంటర్లో దరఖాస్తు చేసుకున్న అనంతరం బ్యాంక్‌లో నగదు చెల్లించాలని తెలిపారు.

జోనల్‌స్థాయి క్రీడాకారుల ఎంపిక

లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబరు 14: జోనల్‌స్థాయి క్రీడాకారులను ఎంపికను ఈ నెల 19, 20 తేదీల్లో చేస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి జుంకిలాల్ తెలిపారు. ప్రతిభకనబర్చిన వారికి జోనల్‌స్థాయిలో జరిగే క్రీడలకు అర్హులన్నారు.

లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఎదురుగడ్డ గ్రామపంచాయతీలో సేయింట్ విన్సెంట్ పాఠశాలలో ఈ నెల 19, 20 తేదీన బాలురు, బాలికల మండల స్థాయి క్రీడాపోటీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలి

● రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నరేంద్రకుమార్

జూలూరుపాడు, సెప్టెంబరు14: స్వామినాథన్‌కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా రైతులు పెట్టిన పెట్టుబడులకు అదనంగా 50శాతం కలిపి మద్దతు ధరను ప్రకటించి కేంద్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతుసంఘం భద్రాద్రి జిల్లా అధ్యక్షులు చంద్ర నరేంద్రకుమార్ డిమాండ్ చేశారు. శనివారం జూలూరుపాడులో విలేకర్లతో మాట్లాడుతూ దేశంలో పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తర్వాత అన్నిరకాల నూనెగింజెల ఉత్పత్తులు రైతుల వద్ద నుంచి ఆయిల్‌ఫాం కంపెనీల వద్దకు చేరిన తర్వాత దిగుమతి సుంకాన్ని పెంచి కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేసిందని ఆరోపించారు. 20శాతం వంట నూనెలపై దిగుమతి సుంకాన్ని పెంచి కేంద్ర ప్రభుత్వం ఆయిల్‌ఫాం కంపెనీలకు లాభాలను చేకూరుస్తుందన్నారు. పెరిగిన నూనె ధరల వల్లసామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులను ఆదుకోవాలనే ఉద్దేశం ప్రభుత్వానికి నిజంగా ఉంటే జనవరి నెలలలోనే సుంకం పెంపు నిర్ణయం తీసునేదని పేర్కొన్నారు.

మొక్కలతోనే మానవాళి మనుగడ


మొక్క నాటుతున్న శివప్రసాద్

చుంచుపల్లి, సెప్టెంబరు14: మొక్కలతోనే మానవాళి మనుగడ సాధ్యపడుతుందని లయన్స్ క్లబ్ 320ఈ ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ శివప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని విద్యానగర్ కాలనీలో లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం మిలీనియం ఆధ్వర్యంలో మొక్కలను నాటి మాట్లాడారు. మొక్కలను నాటడంతో పాటు, సంరక్షించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయని, ఈ కార్యక్రమంలో చుంచుపల్లి యూనిట్ ప్రెసిడెంట్ పాపయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్ శేషగిరిరావు, లయన్స్ లీడర్ సంఘం వెంకటపుల్లయ్య, డాక్టర్ రాజయ్య, శివరాంజీ, మండల రాజేశ్వరరావు, శ్రీనివాస్, సక్రూనాయక్, బాలూనాయక్, నిరంజన్ పాల్గొన్నారు.

భగవద్గీత పారాయణం

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 14: అశ్వారావుపేటలోని ప్రసిద్ధ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం భగవద్గీత పారాయణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. ఏకాదశి సందర్భంగా ఆలయంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో మహిళలు, ఆలయ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

సీఎల్‌సీ నాయకులను వెంటనే విడుదల చేయాలి

ఇల్లెందు టౌన్, సెప్టెంబరు14 : రఘునాథపాలెం ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణ చేసేందుకు వచ్చిన పౌరహక్కుల సంఘం నాయకుల అక్రమ అరెస్టును న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఆవునూరి మధు తీవ్రంగా ఖండించారు. శనివారం ఇల్లెందులోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రఘునాథపాలెం గ్రామ ఆటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై నిజనిర్ధారణ చేసేందుకు వచ్చిన పౌరహక్కుల సంఘం నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. జరిగిన సంఘటనపై న్యాయ విచారణ చేసే హక్కు ఉంటుందని వివరించారు. పోలీసుల అప్రజాస్వామిక చర్యలను ప్రజలు, ప్రజాస్వామిక వాదులు తీవ్రంగా ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో న్యూడెమోక్రసీ నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, ఏనుగుల ప్రకాష్, జానకీ, పరకాల లక్ష్మి, రాజేంద్ర ప్రసాద్, వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ కరుణాకర్‌కు నిత్యావసరాలు పంపిణీ

చుంచుపల్లి, సెప్టెంబరు 14: ఇటీవల అనారోగ్యానికి గురైన జర్నలిస్ట్ కరుణాకర్‌ను తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం పరామర్శించారు. విద్యానగర్ కాలనీలోని జర్నలిస్ట్ ఇంటికి వెళ్లి నిత్యావసర సరుకులతోపాటు, 25 కేజీల బియ్యాన్ని పంపిణీ చేశారు. నిరంతరం ప్రజా సమస్యలను వెలికి తీస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న జర్నలిస్టులకు అండగా ఉంటామని అసోసియేషన్ సభ్యులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కొల్లు నాగేశ్వరరావు, సభ్యులు డాక్టర్ రమణాచారి, ధర్మారావు, శివకృష్ణ, సురేష్‌కుమార్, విజయమోహన్, కామేశ్వరరావు, సోమశేఖరరావు, గురుమూర్తి, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం: భద్రాచలంలోని గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో పేద బ్రాహ్మణులకు శనివారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. శ్రీ సత్యసాయి సేవా సమితి బద్రాచలం, ఆవుల రామకృష్ణ, కొత్త రామలింగయ్య, శంకర్‌రావు, ఆర్కే రామారావు చేతుల మీదుగా వితరణ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్కే రామారావు, డీవీ శంకర్‌రావు, కోవూరి సంతోష్ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఎస్‌బీఐ సేవలు

● రీజనల్ మేనేజర్ సత్యనారాయణ

ఇల్లెందురూరల్, సెప్టెంబరు14: ఎస్‌బీఐ సేవలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. శనివారం ఇల్లెందు మండలం రేపల్లెవాడ రైతువేదికలో రైతులకు, మహిళలకు బ్యాంకు సేవలపై, వివిధ రకాల రుణాలపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముకుందాపురం బ్యాంకు మేనేజర్ సతీష్, కొత్తగూడెం బ్రాంచ్ మేనేజర్ ప్రఫుల్, రామకృష్ణ, మాజి సర్పంచ్ కౌసల్య, పీఏసీఎస్ డైరెక్టర్ కొమరయ్య, పూనెం శ్రీరాములు, కల్తీ స్వామి, ఆజ్మీరా గోప తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరావుపూలే స్టడీ సర్కిల్ ప్రారంభం


సమావేశంలో మాట్లాడుతున్న దేవదానం

పాల్వంచ రూరల్, సెప్టెంబరు14: పాల్వంచ మండలంలోని లక్ష్మీదేవిపల్లి కొమరం భీం హాలులో మహాత్మాజ్యోతిరావుపూలే స్టడీ సర్కిల్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బహుజన ఐక్యవేదిక కన్వీనర్ బరిగడి దేవదానం మాట్లాడుతూ ఈ స్టడీ సర్కిల్ ఎంతో మందికి విజ్ఞానాన్ని పెంపొందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బహుజన ఐక్యవేదిక సభ్యులు చిటికెన ముసలయ్య, నబీ సాహెబ్, హుస్సేన్, శనగ రాంచందర్, అలీ ఖాన్, నిమ్మల రాంబాబు, మంజూర్, తాళ్లూరి సత్యనారాయణలు పాల్గొన్నారు

ఈకేవైసీని తప్పనిసరిగా చేయించుకోవాలి

పాల్వంచ టౌన్, సెప్టెంబర్ 14 : హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు తాము బుక్ చేసుకున్న గ్యాస్ పంపిణీ సమయంలో తమ ఇంటి వద్దకు వచ్చే బాయ్‌కు మీ మొబైల్‌కు వచ్చే 4 అంకెల ఓటీపీని విధిగా తెలిపి సిలిండర్ తీసుకోవాలని హెచ్‌పీ గ్యాస్ (నవభారత్) మేనేజరు అనంతుల లక్ష్మినారాయణ శనివారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హెచ్‌పీసీఎల్ అధికారుల ఆదేశాల మేరకు ఈకేవైసీ, భద్రత తనిఖీలు కూడా తమ సిబ్బందితో తప్పని సరిగా చేయించుకోవాలని దీనికి ఎటువంటి రుసుం చెల్లించాల్సిన పని లేదని ఇది పూర్తి ఉచితమని తెలిపారు. వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించి మీకు గ్యాస్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండ పొందగలరని కోరారు.

'అనూబోస్'లో ఘనంగా ఇంజనీర్స్‌డే వేడుకలు

పాల్వంచ, సెప్టెంబరు 14 : పాల్వంచ పట్టణంలోని అనూబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వివిధ అంశాలలో పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. పూర్వ ఎలక్ట్రికల్ ఇంజనీర్ ప్రస్తుత అమెరికన్ సాఫ్ట్‌వేర్ కన్సల్టెంట్ ఇంటూరి శేషుబాబు ఇంజనీర్ డే యొక్క విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ తలశిల భరత్‌కృష్ణ, ప్రిన్సిపాల్ సుబ్బారావు, డీన్ డాక్టర్ అవని, వైస్ ప్రిన్సిపాల్ వెంకన్న, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దల సమక్షంలో ఒక్కటైన ప్రేజ జంట

కరకగూడెం, సెప్టెంబరు14: మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పెద్దల సమక్షంలో ప్రేమ జంటకు పెళ్లి జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంకటాపురం గ్రామానికి పోలెబోయిన నాగ శ్రీ, మండలంలోని అనంతారం పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన ఇర్ప సాగర్ అనే యువకుడు కొంత కాలంగా ప్రేమించుకున్నారు. విషయం ఇరు కుటుంబ సభ్యులకు తెలవడంతో పెద్దల సమక్షంలో పంచాయతీ జరిగింది. అనంతరం ఇరు కుటంబాల సమత్తితో పెద్దల సమక్షంలో ప్రేమ జంటకు ఆలయ పూజారి వెంకటేశ్వర్లు పెళ్లి జరిపించారు. ఈ కార్యక్రమంలో కుల పెద్దలు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనానికి సర్వం సిద్ధం


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

భద్రాచలం, సెప్టెంబరు 14: తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణనాథుడిని దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలంలోని పవిత్ర గోదావరిలో నిమజ్జనం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా భారీగా గణనాధులు తరలిరానున్నారు. ఇందుకోసం గోదావరి నదీ తీరంలో అధికార యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు ఇప్పటికే చేపట్టింది. ప్రస్తుతం నాలుగు క్రేన్లు ఉండగా, సోమవారం మరో రెండు క్రేన్లు అదనంగా రానున్నాయి. విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేసేందుకు పదిబోట్లు, మూడు లాంచీలను సిద్ధంగా ఉం చారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నా సత్వరమే రక్షణ చర్యలు చేపట్టేందుకు ఎన్డీఆర్ఎఫ్, డీడీఆర్ఎఫ్‌కు చెందిన సిబ్బంది సిద్ధంగా ఉండనున్నారు. ఈసారి గోదావరి ప్రవాహం అధికంగా ఉండడంతో భక్తులను నదిలో స్నానాలకు అనుమతించకుండా, షవర్ల ద్వారా భక్తులు స్నానం చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

భద్రాచలంలో గోదావరి నది వద్ద నిమజ్జన ఘాట్ వద్ద ఏర్పాట్లను ఎస్పీ రోహిత్‌రాజ్ పరిశీలించారు. ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసు వారి సూచనలను పాటించాలని, ప్రశాంతంగా నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యేలా సహాయ సహకారాలు అందించాలని కోరారు.

నిమజ్జన ఘాట్ రూట్..

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భద్రాచలం వచ్చే గణనాథులు గోదావరి వారధి మీదుగా మెయిన్ రోడ్డు, అంబేద్కర్ సెంటర్, కూనవరం రోడ్డు, సీఆర్‌పీఎఫ్ క్యాంపు, ప్రభుత్వ డిగ్రీ క ళాశాల మీదుగా నిమజ్జన ఘాట్‌కు చేరుకోనున్నాయి. అక్కడ గణేష్ విగ్రహాలను క్రేన్ల ద్వారా దించిన అనంతరం తిరిగి ఆ వాహనాలు కరకట్టపై నుంచి శిల్పినగర్ వద్ద ఉన్న ర్యాంపు ద్వారా కిందకు వెళ్లనున్నాయి.

జిల్లా వ్యాప్తంగా 1,537 గణేష్ విగ్రహాల ఏర్పాటు : ఎస్పీ

కొత్తగూడెం, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి) : గణేష్ నవరాత్రులు ముగించుకుని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భద్రాచలం వద్ద గోదావరి నదికి నిమజ్జనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి సౌకర్యాలు కలగకుండ పటిష్ఠమైన ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ రోహిత్‌రాజ్ తెలిపారు. శనివారం నిమజ్జన జరిగే ప్రదేశాలను ఎస్పీ సందర్శించారు. నిమజ్జన సమయంలో ఉత్సవకమిటి సభ్యులు, పోలీసు వారి సూచనలను పాటించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 1537 గణేష్ విగ్రహాలతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కూడా ఎక్కువ మొత్తంలో భద్రాచలానికి నిమజ్జనానికి వస్తున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా రద్దీగా ఉండే ప్రదేశాల్లో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టామన్నారు.

మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శం

● ఎమ్మెల్యేలు కూనంనేని, పాయం


కొత్తగూడెంలో అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు, ఆధారాలు ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. శనివారం పట్టణ పరిసర ప్రాంతాల్లోని మండపాలను సందర్శించి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, దుగ్గిరాశి వెంకటేశ్వర్లు, వాసిరెడ్డి మురళి, గెద్దాడ నగేష్, పోలమూరి శ్రీనివాస్, రాంజీ, కంచర్ల జమలయ్య, భూక్య శ్రీనివాస్, సుగుణ, శ్రీనివాస్, నేరెళ్ల సమ్మెక్క, లగడపాటి రమేష్, పి. సత్యనారాయణ తదితరులున్నారు.

ఏడుళ్ల బయ్యారం గ్రామపంచాయతీ సెంటరులో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నవరాత్రులు వేడుకలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అనంతరం గంద్రాతి సమ్మయ్య వెంకట రమణ దంపతులు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఏడుళ్ల బయ్యారం సీఐ వి. వెంకటేశ్వరరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తాజా, మాజీ వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, గంగిరెడ్డి వెంకటరెడ్డి, ఉడుముల లక్ష్మిరెడ్డి, జి. శ్రీనివాసరెడ్డి, గణేష్ ఉత్సవకమిటీసభ్యులు గంద్రాతి ప్రవీణ్‌కుమార్, తోట గంగాధర్, ఉడుముల రవీందర్‌రెడ్డి, గీద వెంకటేశ్వర్లు, సర్వేష్, శివ, సంపత్, ప్రకాష్, జగదీష్, సందీప్‌రెడ్డి, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపల్లి: కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన వినాయక ఉత్సవమండపాలను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శనివారం సందర్శించి పూజలు చేశారు. గాజులరాజంబస్తీజెండా సెంటరులో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి అన్నవితరణ చేశారు.

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 14: పట్టణంలోని లక్ష్మీగణపతి ఆలయం వద్ద శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజల అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఎస్‌ఐ శివరామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జూపల్లి రమేశ్ ప్రారంభించారు.

జూలూరుపాడు: మండలంలోని పలు గ్రామాల్లో గణనాథుడికి భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. 365 ప్రమిదలతో జ్యోతిర్లింగార్చన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

ఆళ్లపల్లి: మండల పరిధిలోని మర్కోడు బొడ్రాయి సెంటర్‌లో ఏర్పాటు చేసిన గణేష్ మండల వద్ద వ్యాపారవేత్త భూర్ల రాంబాబు మనవడు సిద్ధార్థ్‌అరవ్ పుట్టిన రోజు సందర్భంగా ఈ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజారి వినయ్, తాళ్లపల్లి నాగేశ్వరావు, గణపతిరావు, చిరంజీవి, రంజీత్, ఎల్లాగౌడ్, సూతారి కాంతారావు, రిటైర్డ్ ఏఎస్‌ఐ కన్నయ్య, నవీన్, సదయ్య, నవజీవన్, వికాస్, వినయ్, నవీన్, గణేష్, రమేష్, వెంకట్‌కృష్ణంరాజు, రవి, భరత్, రాము, డేవిడ్, శ్రావన్, శేఖర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతులకు నిధులు కేటాయించండి

● రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే జారే


మంత్రి కోమటిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట, సెప్టెంబరు14 : అశ్వారావుపేట నియోజకవర్గంలో రహదారులకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని శనివారం హైదరాబాద్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కోరారు. ఈసందర్భంగా ఇటీవల కురిసిన వర్షాలకు నియోజకవర్గంలో రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయని రహదారుల మర్మతులకు, నూతన రహదారులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ పరిశీలించి నిధులు కేటయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతి, యువకులకు ఉపాధి కల్పించేందుకు శనివారం చేనేత, హస్తకళల అభివృద్ధి కార్యాలయంలో అధికారులను కలిసి చర్చించారు. చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటు, నిరుద్యోగులకు శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసి శిక్షణ కల్పించేందుకు కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యేకి హామీ ఇచ్చారు.

పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే

హైదరాబాదులో నిమ్స్‌లో చికిత్స పొందుతున్న పలువురికు 5లక్షల రూ.లు ఎల్‌వోసీలు ఇచ్చి పరామర్శించారు. దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ జూపల్లి ఉపేంద్రబాబు అనారోగ్యానికి గురికాగా ఆయనను పరామర్శించారు.

గణేష్ నిమజ్జనాలను ప్రశాంతంగా నిర్వహించాలి

జూలూరుపాడు, సెప్టెంబరు14: గ్రామాల్లో గణేష్ నిమజ్జనాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని జూలూరుపాడు ఎస్‌ఐ రాణా ప్రతాప్ తెలిపారు. శనివారం జూలూరుపాడులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గ్రామాల్లో విగ్రహాల ఊరేగింపు సందర్భంలో డీజేలను వినియోగించవద్దన్నారు. డీజేలను ఏర్పాటు చేసినట్లు తమకు సమాచారం తెలిస్తే వెంటనే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఏచూరి మృతి కమ్యునిస్టు ఉద్యమానికి తీరని లోటు

» సీపీఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ సలీం


సీతారాం ఏచూరి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకులు

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 14: సీపీఎం ఆల్ ఇండియా కార్యదర్శి కామ్రెడ్ సీతారాం ఏచూరి మృతి ఉమ్మడి కమ్యునిస్టు ఉద్యమానికి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ సలీం అన్నారు. అశ్వారావుపేటలోని సయ్యద్‌మియాజాని భవన్‌లో శనివారం సీపీఐ ఆధ్వర్యంలో ఏచూరి సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రామకృష్ణ, ఏఐటీయూసీ మండల కార్యదర్శి జలాల్, నాయకులు రమేశ్, అబ్బాస్, సంజయ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: భారతదేశం గర్వించదగ్గ గొప్ప నాయకుడు సీతారాం ఏచూరి అని సీపీఎం సీనియర్ నాయకులు యలమంచి రవికుమార్ కొనియాడారు. రామకృష్ణాపురంలో శనివారం ఏచూరి సంతాప సభ నిర్వహించారు పుల్లయ్య, సూర్యచంద్రరావు, మల్లారెడ్డి, సీతారామరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, బిత్తేశ్వర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, ముత్యాలరావు పాల్గొన్నారు.

కొత్తగూడెం: భారత కార్మిక ఉద్యమానికి ఏచూరి మరణం తీరని లోటని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు భూక్య రమేష్ అన్నారు. శనివారం సింగరేణి కాంట్రాక్టు కార్మిక ప్రాంతాల్లో ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సూరం ఐలయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుగులోత్ సక్రాం, బాబురావు, భంగిలాల్, జాకబ్, స్టాలీన్, సతీష్ తతదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ రూరల్: సీపీఎం పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి త్యాగం మరువలేనిదని సీపీఎం పార్టీ జిల్లా నాయకుడు అన్నవరపు సత్యనారాయణ అన్నారు. శనివారం దంతెలబోరలో సీతారాం ఏచూరి సంతాప సభ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కొండబోయిన వెంకటేశ్వరరావు, నాయకులు కంటె శ్రీను, ఖాజా, కే. నాగభూషణం, మల్లిఖార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం: కమ్యూనిస్టు యోధున్ని, గొప్ప రాజనీతిజ్ఞుణ్ణి, ధీరోదాత్తుడుని కోల్పోయామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే రమేష్‌లు అన్నారు. పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన నిర్వహించిన వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యు లు ఎంబి నర్సారెడ్డి, వీరభద్రం, రవివర్మ, కృష్ణ, ఎ.వెంకటేశ్వర్లు, విజయ్, దాసరి శేఖర్, పలుపార్టీల నాయకులు రావులపల్లి రవికుమార్, తిప్పన సిద్ధులు, కొడాలి శ్రీనివాసన్, ముర్లా రమేష్‌రెడ్డి, వీరభద్రం, రామేలింగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం(ఆంధ్రజ్యోతి): సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి భౌతికాయాన్ని ఢిల్లీలోని సీపీఎం పార్టీ కేంద్ర కార్యాలయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన సీపీఎం పార్టీ నాయకులు శనివారం సందర్శించి నివాళులర్పించారు. సీపీఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య రాష్ట్ర సీపీఎం పార్టీ నాయకులు డి. వెంకట్, జిల్లా పార్టీ కార్యదర్శివర్గసభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య, లిక్కి బాలరాజు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బి. వీరన్న, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు బి. వీరభద్రం, కాళంగి హరికృష్ణ, జునుమాల వంశీలు ఉన్నారు. ఆయన భౌతికాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అమరహే.. సీతారాం ఏచూరి అంటూ నినదించారు. ఆయన మరణం పార్టీకి, దేశానికి తీరని లోటని పేర్కొన్నారు.

ప్రజల కోసం పోరాడిన వ్యక్తి సీతారాం ఏచూరి: సాయి సూర్య

భద్రాచలం, సెప్టెంబరు 14: బడుగు బలహీన వర్గాల ప్రజల హక్కుల కోసం పోరాడిన సీతారాం ఏచూరికి లాల్ సలామని మాగంటి సాయిసూర్య పేర్కొన్నారు. భద్రాచలంలో శనివారం జరిగిన సీతారాం ఏచూరి సంతాపసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పుట్టుక నీది చావు నీది మధ్యలో జీవితమంతా ప్రజలది అంటూ కవితను చదివారు. పేదల కోసం తన రాజకీయ జీవితమంతా నిస్వార్థంగా నిబద్ధతతో సీతారాం ఏచూరి పోరాడారని పేర్కొన్నారు. కాగా మాగంటి సాయిసూర్య మాట్లాడిన ఉపన్యాసం పట్ల వేదిక అలంకరించిన పెద్దలు మాగంటి సాయిసూర్యని ప్రత్యేకంగా అభినందించారు. తాత మాగంటి సూర్యం బాటలోనే మనవడు సూర్య కూడా నడుస్తున్నారని పేర్కొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యేలు


టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌కు చిత్రపటం అందిస్తున్న ఎమ్మెల్యేలు

అశ్వారావుపేట రూరల్/ఇల్లెందు: తెలంగాణ పీసీసీ నూతన అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యలు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని నూతన అధ్యక్షుడిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అధికారులు తీసుకున్న చర్యలు భేష్

» ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లాలో కురిసిన వర్షాలకు ఆస్తి, ప్రాణనష్టం జరగకుండ జిల్లా అధికార యంత్రం స్పందించిన తీరు అభినందనీయమని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వారంలో కురిసిన వర్షాలకు ధ్వంసమైన ప్రధాన, అంతర్గత రోడ్లు, కల్వర్టులు, చెరువులు యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించడంలో, అధికారులను అప్రమత్తం చేయడంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ కృషి చేశారని అన్నారు. పాల్వంచ మండలం దంతెలబోరు గ్రామం రెండుసార్లు ముంపునకు గురై గ్రామీణ ప్రజలు జలదిగ్బంధంలో చిక్కుకున్న పరిస్థితిలో కలెక్టర్ పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్ క్షేత్రస్థాయిలో పర్యటించి సమన్వయంతో అధికార యంత్రాంగం పని చేయడం వల్లే నష్టాన్ని నివారించగలిగామని పేర్కొన్నారు.

దళిత మహిళను హత్య చేసిన వారిని శిక్షించాలి


సీఎల్సీ నాయకులకు వినతి పత్రం అందిస్తున్న దళిత సంఘం నాయకులు

కరకగూడెం, సెప్టెంబరు14: దళిత మహిళను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని దళిత ఆదివాసీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఇటీవల కరకగూడెం మండలం రఘునాథపాలెం మోతే పరిధిలోని దోనాల గుట్ట అడవి ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్‌కు సంబంధించి విచారణ కోసం శనివారం పౌరహక్కుల సంఘం కమిటీ కరకగూడెం వస్తుండగా దళిత ఆదివాసీ సంఘం నాయకులు అడ్డుకున్నారు. అంతేకాక కాల్పుల్లో ఇద్దరు పోలీసు కమాండోలు కూడా తీవ్రంగా గాయపడ్డారని, సీఎల్సీ మావోయిస్టు అనుకూల ఫ్రంట్ నాయకులను ప్రశ్నించేందుకు తాత్కాలింగా ఆపారు. ఈ సందర్భంగా సీఎల్సీ నాయకులు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇటీవల దళిత మహిళా అయిన నీల్సోను అత్యంత క్రూరంగా చంపివేయడం జరిగినప్పటికి.. ఆమె హత్య గురించి ప్రజా సంఘాల నాయకులు ఇంతవరకు ఒక్కమాట కూడా మాట్లాడలేదని ప్రశ్నించారు. దళిత మహిళా కార్యకర్తలు పౌర హక్కుల కమిటీ పద్ధతిని వారు రాజ్యాంగ విరుద్ధంగా ప్రవర్తిస్తున్న మావోయిస్టులకు మద్దతు ఇవ్వడంపై నిరసన వ్యక్తం చేశారు. తక్షణమే దళిత మహిళాను హత్య చేసినందుకు విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

రామయ్యను దర్శించిన ఎస్పీ రోహిత్‌రాజ్ దంపతులు


రామాలయంలో ఎస్పీ కుటుంబ సభ్యులు

భద్రాచలం, సెప్టెంబరు 14: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని శనివారం సాయంత్రం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ దంపతులు దర్శించారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలుకగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా స్వామి వారి ప్రసాదం ఎస్పీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఈఈ వి.రవీంద్రనాథ్, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, వేద పండితులు చిట్టి హనుమత్‌శాస్త్రి, శ్రీరామాయణపారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

'సాయుధపోరాట సభను జయప్రదం చేయండి'


సమావేశంలో మాట్లాడుతున్న జాటోత్ కృష్ణ

జూలూరుపాడు, సెప్టెంబరు14: సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజా పంథా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో నిర్వహించనున్న సాయుధ పోరాట సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గసభ్యులు జాటోత్ కృష్ణ తెలిపారు. శనివారం మండలంలోని అన్నారుపాడు గ్రామంలో పార్టీ మండల కార్యదర్శి బాణోత్ ధర్మా అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతాంగ సాయుధపోరాటాన్ని అన్నిమతాలు, కులాలు, దళితులు, రైతులు, కష్టజీవులందరు సాధించారన్నారు. ఈ సభలో పోరాట ప్రాముఖ్యతను తెలియచేసి సాయుధపోరాటయోధులకు నివాళులర్పించడం జరుగుతుందని, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యదలాపురం గోపాలరావు, సతీష్, జగదీష్, వీరన్న, హత్తీరాం, సుజాత పాల్గొన్నారు.